PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 334 | విజయవాడ, ఆదివారం 7 జూలై 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 7 July 2024 | Rs

వ్యవసాయ కార్మికులకు కార్పొరేషన్ ఎప్పుడు?

- మేనిఫెస్టోలో టిడిపి కూటమి హామీ
- కూలీల్లో ఉత్కంఠ

లోపలి పేజీలో..



తొలి పరీక్షలో యువ జట్టుకు నిరాశ

- 116పరుగుల ఛేదనలో 102పరుగులకే పరిమితం
- తొలి టి20లో జింబాబ్వే చేతిలో అనూహ్య ఓటమి

8

చర్చలే మార్గం...!

ముఖ్యమంత్రుల భేటీలో నిర్ణయం

మంత్రులతో ఒక కమిటీ, అధికారులతో మరో కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్, అమరావతి బ్యూరోలు

చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని తెలుగు రాష్ట్రాలు నిర్ణయించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో విభజన సమస్యల పరిష్కారమే అజెండాగా నిర్వహించిన కీలక సమావేశంలో ఈ మేరకు నిర్ణయానికి వచ్చారు. సాయంత్రం 6.10 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం 7.45 గంటలకు ముగిసింది. ఇరు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్న ఈ సమావేశంలో చర్చల ప్రక్రియను ముందుకు తీసుకుపోవడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. దీనిలో భాగంగా ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులతో ఒక ఉన్నత స్థాయి కమిటీని, మంత్రులతో మరో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. అధికారుల కమిటీలో ఇరు రాష్ట్రాల సిఎస్‌లతో పాటు రెండు రాష్ట్రాల నుండి ముగ్గురేసి అధికారులను నియమించాలని నిర్ణయించారు. రెండు వారాల్లోగా ఈ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీ సభ్యులు తరచు సమావేశమై సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారు. వీరి స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను మంత్రుల కమిటీ ముందుకు తీసుకువెళ్తారు. మంత్రుల కమిటీలో ఎవరెవరు ఉంటారన్నది ఇంకా స్పష్టత రాలేదు. వారి స్థాయిలో కూడా పరిష్కారం కాని సమస్యలను ముఖ్యమంత్రుల స్థాయిలో పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. ఈ కమిటీలు తరచు సమావేశం కావాలని, సమస్యల పరిష్కార ప్రక్రియను ముందుకు తీసుకుపోయేలా ఈ కమిటీల పనితీరు ఉండాలన్న అభిప్రాయాన్ని ఇరువురు నేతలు వ్యక్తం చేశారు. అవసరాన్ని బట్టి ముఖ్యమంత్రుల స్థాయిలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. సమస్యల పరిష్కారానికి కాలవ్యవధిని నిర్ణయించాలని, సాగదీత లేకుండా ఆ కాల వ్యవధిలోనే సమస్యలు పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. న్యాయపరమైన వివాదాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి. ఇరు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగకుండా సమస్యలను పరిష్కరించుకోవాలన్న అభిప్రాయాన్ని సిఎంలు వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుండి చర్చల్లో సిఎం చంద్రబాబు తో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, బి.సి.జనార్ధన్‌రెడ్డి, కందుల దుర్గేష్, సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ పాల్గొన్నారు. తెలంగాణ నుండి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ,సిఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు. సమావేశం అనంతరం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆంధ్రప్రదేశ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాకు వివరాలను వెల్లడించారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విభజన సమస్యలపై కూలంకషంగా చర్చించినట్లు చెప్పారు. సమస్యలను పరిష్కరించుకోవడానికి ఇరు రాష్ట్రాల సిఎంలు పట్టుదలగా ఉన్నారని చెప్పారు. రెండు రాష్ట్రాలను పట్టిపీడుస్తున్న డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడికి అడిషినల్ డిజి స్థాయి అధికారులతో సంయుక్తంగ కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ, 'ఇది తెలుగు జాతి హర్షించే రోజు' అని అభివర్ణించారు. రెండు రాష్ట్రాల ప్రజలకు మేలు జరిగేలా అన్ని అంశాలపై లోతుగా చర్చించి సమస్యలకు పరిష్కారం చూపుతామని అన్నారు. అంతకుముందు శనివారం సాయంత్రం 6.10గంటలకు ప్రజాభవన్‌కు చేరుకున్న చంద్రబాబుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. ఇద్దరు సిఎంల సమావేశం ప్రారంభానికి ముందు..కాళోజి రచించిన 'నా గొడవ' పుస్తకాన్ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబుకు బహుకరించారు.



హైదరాబాద్‌లోని ప్రజాభవన్ సమావేశంలో చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి

ఆ ఐదు గ్రామాలివ్వండి : తెలంగాణ

పోలవరం ప్రాజెక్టు ముంపులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన మండలాల్లోని ఐదు గ్రామాలను తిరిగి తమకు అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం ఈ సమావేశంలో కోరినట్లు తెలిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు,గుండాల, పురుషోత్తమపట్నం గ్రామాలను తమకు ఇవ్వాలని ఆ రాష్ట్రం కోరినట్లు సమాచారం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని రాతపూర్వకంగా కూడా కోరుతామని ఈ సమావేశంలో చెప్పినట్లు సమాచారం.

విద్యుత్ బకాయిలు చెల్లించండి :

తెలంగాణ నుండి రావాల్సిన విద్యుత్ బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సమావేశంలో కోరింది. బకాయిలకు సంబంధించిన వివరాలను తెలంగాణ ప్రభుత్వానికి అందచేశారు. అదే విధంగా హైదరాబాద్‌లో మూడు భవనాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని కోరారు. వీటితో పాటు అన్ని అంశాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు.

చర్చించిన అంశాలు

- రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూలు 9,10 లో పేర్కొన్న సంస్థల ఆస్తుల పంపకం
- విభజన చట్టంలో పేర్కొనని సంస్థల ఆస్తుల పంపకాలు
- ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ అంశాలు
- పెండింగ్ విద్యుత్ బిల్లులు
- విదేశీ రుణ సాయంతో ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టుల అప్పుల పంపకాలు
- ఉమ్మడి సంస్థలకు చేసిన ఖర్చుల చెల్లింపులు
- లేబర్ సెస్ పంపకం
- ఉద్యోగుల విభజన అంశాలు

23న కేంద్ర బడ్జెట్

- 22 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పద్దెనిమిదో లోక్‌సభ తొలి బడ్జెట్ సమావేశాలు ఈనెల 22 నుంచి ఆగస్టు 12 వరకు జరగనున్నాయి. 23న కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెడతారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం వెల్లడించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు గత పదేళ్లలో రూ.17.46 లక్షల కోట్ల మేర బ్యాంకు రుణాలను మాఫీ చేసింది. మూడవ పర్యాయంలోనూ క్రోనీ కేపిటలిస్టులకు ప్రజా సంపదను దోచిపెట్టే ధోరణి కొనసాగుతుందా? అధిక ధరలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ధరల పెరుగుదల వల్ల 100 కోట్ల మంది అంటే 74.1 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్లు అయిదు ఐక్యరాజ్యసమితి ఏజెన్సీలు రిపోర్టు లిచ్చాయి. దీనిపై బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దృష్టి సారిస్తుందా? నూతన విద్యా రంగానికి జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, ఇప్పటివరకు 3 శాతం లోపే కేటాయిస్తున్నారు. ఈసారైనా కేటాయిం పులు పెంచుతారా? నిరుద్యోగ సమస్య చాలా తీవ్రంగా ఉంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలకు ఎసరుపెట్టిన మోడీ ప్రభుత్వం దేశ వ్యాపితంగా భర్తీ చేయకుండా అట్టిపెట్టిన 25 లక్షల పోస్టుల సంగతేంటి? ఇలా అనేక ప్రశ్నలు ఆర్థిక మంత్రి ముందున్నాయి. వీటికి ఈ బడ్జెట్‌లో పరిష్కారం ప్రభుత్వం చూపుతుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. బిజెపికి సొంతంగా మెజార్టీ లేకపోయినా ఆర్థికశాఖతో సహా కీలకమైన పదవులను తన మనుషులతో, అందునా పాత ముఖాలతో నింపేసింది. వరుసగా ఆరుసార్లు బడ్జెట్‌లను సమర్పించిన మాజీ ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్‌ని నిర్మలమ్మ అధిగమించనున్నారు.

త్రిపురలో భయపెడుతున్న ఎయిడ్స్

- రోజుకు సగటున 5 హెచ్‌ఐవి కేసులు
- ఈ ఏడాది ఇప్పటికే 47 మంది విద్యార్థుల మృతి


త్రిపుర: బిజెపి పాలనలో ఉన్న త్రిపురలో ఎయిడ్స్ మహమ్మారి విజృంభిస్తోంది. విద్యార్థుల్లో ఎక్కువగా ఈ వ్యాధి బయటపడుతుండటం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఏడాది మే 31 వరకు సేకరించిన గణాంకాల ప్రకారం ఇప్పటికే 47 మంది విద్యార్థులు హెచ్‌ఐవి బారిన పడి చనిపోయారు. రోజుకు అయిదు చొప్పున హెచ్‌ఐవి కేసులు నమోదవుతున్నాయి. ఈ వివరాలను ఇటీవల నిర్వహించిన ఒక సెమినార్‌లో ఆ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 828 మంది విద్యార్థులను హెచ్‌ఐవి పాజిటివ్‌గా గుర్తించినట్లు తెలిపారు. 828 మంది హెచ్‌ఐవి పాజిటివ్ విద్యార్థుల్లో 572 మంది వివిధ దశల్లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. 'మే 2024 నాటికి 8729 మంది లైంగిక సంబంధిత (ఎఆర్‌టి) వ్యాధుల బారినపడ్డారు. వీరిలో 5674 మంది హెచ్‌ఐవితో బాధపడుతున్నారు. బాధితుల్లో 4570 మంది పురుషులు కాగా 1103 మంది మహిళలు. ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు' అని సంబంధిత అధికారులు వివరించారు. 220 పాఠశాలలు, 24 కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి డ్రగ్స్ ఇంజెక్షన్ తీసుకుంటున్న విద్యార్థుల సమాచారం ఆధారంగా ఈ డేటా రూపొందించారు.

అభివృద్ధికి నోచని ఉర్దూ యూనివర్సిటీ

సొంత భవనం నిర్మాణానికి నిధుల లేమి

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

పాలకుల నిర్లక్ష్యానికి ఉర్దూ యూనివర్సిటీ ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రొఫెసర్ల కొరత, నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. నూతన భవన నిర్మాణాలకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో, అద్దె భవనంలో కొనసాగుతోంది. ఉర్దూ సంస్కృతిని, భాషను కాపాడేందుకు, మైనార్టీ ప్రజల జీవన సంస్కృతిని ప్రతిబింబించేందుకు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని 2016 నవంబర్‌లో కర్నూలులోని ఉస్మానియా కళాశాల కేంద్రంగా ప్రారంభించారు. ఆరు రకాల డిగ్రీ కోర్సులు, ఏడు పిజి కోర్సులను అందిస్తున్నారు. ప్రస్తుతం 280 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిని ఆది నుంచీ కష్టాలు వెంటాడుతూ ఉన్నాయి. ఓర్వకల్లు మండలం పూడిచర్ల పరిసర ప్రాంతంలో 144 ఎకరాల స్థలాన్ని ఉర్దూ యూనివర్సిటీ కోసం ప్రభుత్వం కేటాయించింది. సొంత భవనాల నిర్మాణానికి రూ.వంద కోట్లు అవసరం కాగా, గతంలో టిడిపి ప్రభుత్వం రూ.18 కోట్లు మాత్రమే కేటాయించింది. దీంతో, భవన నిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. అకాడమిక్ బిల్డింగ్, బాలుర, బాలికల వసతి గృహాలు, అంతర్గత రోడ్ల పనులకు రూ.20 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపినా వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. 2018 నుంచి ఉర్దూ యూనివర్సిటీని కల్లూరు మండలం పందిపాడు పరిధిలోగల ఆదాయ పన్నుల శాఖ కార్యాలయానికి సమీపంలోని ఒక అద్దె భవనానికి మార్చారు. యూనివర్సిటీ పరిపాలన విభాగం నిర్వహణకు ఏటా దాదాపు రూ.67.20 లక్షలు అవసరం కాగా, గత ఐదేళ్ల నుంచి నిధులు విడుదల కావడం లేదు.



అర్థాంతరంగా ఆగిపోయిన యూనివర్శిటీ భవనాల నిర్మాణం

వేధిస్తున్న ప్రొఫెసర్ల కొరత

ఉర్దూ యూనివర్సిటీని ప్రొఫెసర్ల కొరత వేధిస్తోంది. యూనివర్సిటీకి 67 టీచింగ్ పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 15 మంది అధ్యాపకులు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. రెగ్యులర్ ప్రొఫెసర్ ఒక్కరు కూడా లేరు. సిబ్బంది జీతభత్యాలకు ఏడాదికి రూ.1.74 కోట్లు అవసరం కాగా, గత ప్రభుత్వం సంవత్సరానికి రూ.92.50 లక్షలను మాత్రమే విడుదల చేసింది.

సౌకర్యాలు, కొత్త కోర్సులు కరువు

ఉర్దూ యూనివర్సిటీలో సైన్స్ విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం లేక ఇతర కళాశాలల్లో ప్రాక్టికల్స్ చేయాల్సి వస్తోంది. ఇంటిగ్రేటెడ్ లా కోర్సు, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ వంటి నూతన కోర్సులకు ప్రతిపాదనలు పంపి సంవత్సరాలు గడుస్తున్నా ఉన్నత మిగతా 2లో

నీట్ కౌన్సిలింగ్ వాయిదా

- అక్రమాలపై సుప్రీంలో రేపు విచారణ

న్యూఢిల్లీ : జాతీయ స్థాయిలో వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నీట్ పేపర్ లీకేజీ, అక్రమాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుండటంలో శనివారం జరగాల్సిన నీట్ యుజి కౌన్సిలింగ్‌ని మెడికల్ బోర్డు వాయిదా వేయాలని నిర్ణయించింది. తదుపరి నోటీసులు ఇచ్చేంత వరకు కౌన్సిలింగ్ వాయిదా పడినట్లు వివరించింది. సుప్రీంకోర్టు ఈ కేసును సోమవారం విచారించనుంది. తీర్పు అనంతరం కౌన్సిలింగ్‌పై బోర్డు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కౌన్సిలింగ్ వాయిదాకు సుప్రీంకోర్టు నిరాకరించినప్పటికీ ఎన్‌టిఎ ఈ నిర్ణయం తీసుకుంది. మే 5న నిర్వహించిన నీట్ (యుజి) -2024 పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడంతోబాటు పలు అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అవకతవకలపై సుప్రీం కోర్టులో 26 పిటిషన్లు దాఖలు చేశారు.


గుంతకల్లు డిఆర్‌ఎం అరెస్టు

ప్రజాశక్తి- గుంతకల్లు టౌన్

గుంతకల్లు రైల్వే డివిజన్ కార్యాలయంలో అధికారుల అవినీతి కలకలం రేపింది. రైల్వే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు లంచం తీసుకున్న డిఆర్‌ఎంతోపాటు నలుగురు అధికారులను సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన సిబిఐ డిప్యూటీ ఎస్‌పి జైకుమార్ భర్ధియా తెలిపిన వివరాల ప్రకారం... గుంతకల్లు డివిజన్ పరిధిలోని కడప, తిరుపతి, కదిరి, గుంతకల్లు ప్రాంతాల్లో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనులను అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చేందుకు రైల్వే అధికారులు డబ్బులను లంచంగా అడిగారు. దీంతో, కాంట్రాక్టర్లు సిబిఐ అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ రమేష్ కుమార్ రెడ్డి ఇంజనీరింగ్ విభాగంలో బాలాజీకి ఈ నెల 4వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో రూ.14 లక్షల నగదు ఇచ్చారు. అదే సమయంలో జైకుమార్ భర్ధియా నేతృత్వంలోని సిబిఐ బృందం రైడ్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. బాలాజీని అదుపులోకి తీసుకుంది. గుంతకల్లు డిఆర్‌ఎం కార్యాలయంలో భాగమైన ఆర్థిక విభాగంలో గత రెండు రోజులుగా ముమ్మర తనిఖీలు నిర్వహించింది. రైల్వే డిఆర్‌ఎం వినీత్ సింగ్, డిఎఫ్‌ఎం కుందా ప్రదీప్ బాబు, సీనియర్ డిఇఎన్ కోఆర్డినేషన్ అక్కిరెడ్డి, ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ ఎం.బాలాజీ, గతిశక్తి విభాగం అకౌంట్స్ అసిస్టెంట్ డి.లక్ష్మీపతిరాజులను లంచం వ్యవహారంలో నిందితులుగా గుర్తించి వారిని శనివారం అరెస్టు చేసింది. గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి వీరు ఐదుగురినీ కర్నూలు జిల్లా సిబిఐ కోర్టుకు తరలించింది. ఇన్‌ఛార్జి న్యాయమూర్తి పాండురంగారెడ్డి వారికి 14 రోజులు రిమాండ్ విధించారు.



వైద్య పరీక్షల నిమిత్తం నిందితులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబిఐ అధికారులు



నరసరావుపేట ఆస్పత్రిలో కామినేని రామారావును పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

పింఛనుదారులకు అండగా ఉంటే దాడులు చేస్తారా?

- దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి
- నరసరావుపేట ఆస్పత్రిలో రామారావుకు వి శ్రీనివాసరావు పరామర్శ

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

పింఛనుదారులకు అండగా నిలిచిన సిపిఎం నాయకుడు, ఎపి కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి కామినేని రామారావుపై టిడిపి నాయకుల దాడిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం టిడిపి నాయకుల దాడిలో గాయపడి నరసరావుపేట ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం పగటిచర్ల గ్రామానికి చెందిన రామారావును శనివారం ఆయన పరామర్శించారు. దాడి జరిగిన తీరు, ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. రామారావుకు మిగతా 2లో

గోదాట్లో చనిపోతున్న చేపలు

ఆహారం దొరకకపోవడం, వాతావరణమే కారణమంటున్న అధికారులు

ప్రజాశక్తి- రామచంద్రపురం, తాళ్లరేవు

అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉప్పు నీటి చేపలైన కానాగంతలు వేల సంఖ్యలో చనిపోయాయి. కె.గంగవరం మండలం మసకపల్లి, బ్రహ్మపురి, వాసాలరేవు, పిల్లంక నుంచి యానాం వరకు పెద్ద ఎత్తున చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. దీంతో, మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి నుంచి చేపల వేటకు వెళ్లడం లేదు. ఆహారం కొరత, ఆక్సిజన్ సరిగా అందకపోవడం వంటి కారణాల వల్లే పెద్ద సంఖ్యలో చేపలు మృతి చెంది ఉంటాయని అధికారులు చెప్తున్నారు. చేపలు చనిపోయిన ప్రాంతాన్ని మత్స్యశాఖ అధికారులు శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్య శాఖ అభివృద్ధి అధికారి (ఎఫ్‌డిఒ) డాక్టర్ గోపీ మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేయడంతో చేపల ప్రధాన ఆహారమైన ఫ్రాజిలేరియా ఓషియానికా అనే శైవలం చనిపోయిందని తెలిపారు.


దీంతో, చేపలకు ఆహార కొరత ఏర్పడి ఉండవచ్చన్నారు. ఉప్పు నీటి చేపలైన కానాగంతలు పెద్ద ఎత్తున చప్ప నీటి గోదావరిలోకి వలస రావడంతో మారిన వాతావరణ పరిస్థితులు, లవయణీయతను తట్టుకోలేక కూడా చనిపోయి ఉండవచ్చని తెలిపారు. చనిపోయిన చేపలన్నీ ఒకే జాతికి చెందినవిగా గుర్తించామన్నారు. చనిపోయిన చేపలను, నీటి శాంపిళ్లను పరీక్షల నిమిత్తం కాకినాడలోని మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థకు పంపించామని ఎఫ్‌డిఒ జి.గోపీ, ఎస్‌ఐఎఫ్‌టి మత్స్య శాఖ అభివృద్ధి అధికారి కె.చలపతి తెలిపారు. ఏటా ఈ చేపలు సముద్రం నుంచి గోదావరిలోకి ఈ సమయంలో సాధారణంగా వలస వస్తుంటాయని, ఈ సంవత్సరం అధిక మొత్తంలో వీటి సంఖ్య ఉందని మత్స్యకారులు అంటున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో పెద్ద ఎత్తున చేపలు చనిపోవడంతో రెండు రోజులుగా మాసకపల్లి, వాసాలరేవు, బ్రహ్మపురి, పిల్లంక గ్రామాల మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చి వేట విరమించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



మసకపల్లి, పిల్లంక, బ్రహ్మపురిలో మతి చెందిన చేపలు

విచారణ జరపాలి : జిల్లా మత్స్యకార సంఘం నాయకులు

చేపలు పెద్ద ఎత్తున చనిపోవడంపై విచారణ జరపాలని జిల్లా మత్స్యకార సంఘం నాయకులు దోమ ఆదినారాయణ డిమాండ్ చేశారు. గోదావరిలో ఇంత పెద్ద సంఖ్యలో చేపలు చనిపోవడం ఎప్పుడు చూడలేదన్నారు. దీనికి కారణాలు అధికారులు కొనుగొనాలని కోరారు. ఉపాధి కోల్పోయిన మత్స్యకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఇరాన్ అధ్యక్షుడిగా మధ్యేవాది పెజెష్కియాన్ ఎన్నిక

టెహరాన్ : ఇరాన్ అధ్యక్షుడిగా మధ్యేవాది, సంస్కరణవాది అయిన మసూద్ పెజెష్కియాన్ (69) ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన రనాఫ్ రౌండ్‌లో కరడు గట్టిన ఛాందసవాది జలిలి (58)పై ఆయన 29 లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. విజయం అనంతరం పెజెష్కియాన్ మాట్లాడుతూ, మన ముందున్నది క్లిష్టతరమైన బాట అని, ప్రజల ఆదరాభిమానాలతో ఆ ప్రయాణం సాఫీగా, సజావుగా సాగిద్దామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ ప్రయాణంలో మిమ్మల్ని ఒంటరిగా వదిలేసి వెళ్లేది లేదని ఆయన ప్రజలకు హామీనిచ్చారు. 3కోట్లకు పైగా ఓట్లు పోలవగా, పెజెష్కియాన్‌కు కోటీ 64లక్షల ఓట్లు వచ్చాయి. ఆయన ప్రత్యర్థి భకి కోటీ 35లక్షల ఓట్లు లభించాయి. . 'పెజెష్కియాన్ ఇరాన్ తదుపరి అధ్యక్షుడయ్యారు.' అని హోం శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

శాస్త్రీయంగా వ్యర్థాల వినియోగ ప్రక్రియ

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యర్థాల వినియోగ ప్రక్రియ శాస్త్రీయంగా నిర్వహించడం ద్వారా సరికొత్త సంపద సృష్టించవచ్చని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. ఘన, ద్రవ వ్యర్థాల విషయంలో సృజనాత్మకంగా ఆలోచించి దానిని పునర్వినియోగం చేస్తే పారిశుధ్య సమస్యను అధిగమించవచ్చని అన్నారు. సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎస్‌ఎల్‌ఆర్‌ఎం) ప్రాజెక్టు డైరెక్టరు ఆధ్వర్యాన శనివారం మంగళగిరిలోని డిప్యూటీ సిఎం కార్యాలయంలో గార్బేజ్ టూ గోల్డ్ పేరుతో అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథంతో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అధ్యయనాలు జరుగుతున్నాయన్నారు. ఈ రంగంలో అనుభవమున్న నిపుణులతో వర్క్‌షాప్ నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎస్‌ఎల్‌ఆర్‌ఎం ప్రాజెక్టు డైరెక్టరు సి శ్రీనివాసన్ పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు ఆధారంగా ఎస్‌సి, ఎస్‌టిల ఉద్యోగోన్నతులు

- మంత్రికి కెవిపిఎస్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టిల ఉద్యోగోన్నతుల్లో జర్నిల్‌సింగ్-2 కేసులో సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి కెవిపిఎస్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, సిఎస్, సాంఘిక సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్లకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి శనివారం లేఖ రాశారు. జనరల్ కేటగిరిలో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని లేఖలో కోరారు. జర్నిల్ సింగ్-2 కేసులోని సుప్రీంతీర్పు ఆధారంగా క్యాడర్ యూనిట్‌గా లెక్కించాలని కెవిపిఎస్ నేతలు విజ్ఞప్తి చేశారు. 85వ రాజ్యాంగ సవరణ ఆర్టికల్ 16 (4) ఎస్‌సి, ఎస్‌టిల ఉద్యోగోన్నతులతోపాటు సీనియారిటీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో ఉల్లిపాయల వ్యాపారి మృతి

ప్రజాశక్తి-బంటుమిల్లి (కృష్ణా జిల్లా)

గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో ఉల్లిపాయల వ్యాపారి మృతి చెందారు. ఈ సంఘటన కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములపర్రు గ్రామానికి చెందిన చిగురుశెట్టి సుభాష్ చంద్రబోస్ (40) జానకిరాంపురంలో నివాసం ఉంటున్నారు. ప్రతిరోజు తనకున్న ఆటోలో ఉల్లిపాయల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నారాయణపురం మలుపు సమీపంలో ఆటో పంట బోదిలో పడిపోవడంతో సుభాష్ చంద్రబోస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆయన్ను విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న బోస్ శనివారం ఉదయం మృతి చెందారు. అయితే, గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి కొట్టడంతోనే మృతి చెంది ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఆటో పడిపోయిన ప్రదేశంలో గాలి పంపుతో బలంగా కొట్టి ఉంటారని, గాలి పంపు రాడ్డుకు రక్తం మరకలు అంటి ఉండటం, మృతుడికి తీవ్రమైన గాయాలు కావటం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. మచిలీపట్నం క్లూస్ టీం వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి నోచని ఉర్దూ యూనివర్సిటీ

(మొదటి పేజీ తరువాయి)

విద్యా మండలి నేటికీ ఆమోదం తెలపలేదు.

నిధులొస్తే త్వరగా పనులు

ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే త్వరితగతిన భవనాలను పూర్తి చేస్తాం. ఉన్నత విద్యా మండలి కొన్ని కోర్సులను ఆమోదించాల్సి ఉంది. ప్రభుత్వం, ఉన్నత విద్యా మండలి ఆదేశానుసారం ప్రణాళికాబద్ధంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం.

- ఆచార్య బయినేని శ్రీనివాసులు, ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్

ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

సిఎం చంద్రబాబు ఉర్దూ యూనివర్సిటీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. యూనివర్సిటీ భవనాల నిర్మాణాలకు, పాలనా అవసరాలకు నిధులు కేటాయించాలి. అధ్యాపక పోస్టులను భర్తీ చేసి బోధనకు ఇబ్బంది లేకుండా చూడాలి.

- ఎస్.అబ్దుల్లా, ఎస్‌ఎఫ్‌ఐ కర్నూలు జిల్లా కార్యదర్శి

కేసులు ఏం చేద్దాం ?

- వెనక్కి తీసుకునే ఆలోచనలో రైతులు, ప్రభుత్వం



అమరావతి రైతులను అడ్డుకుంటున్న పోలీసులు (ఫైల్)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి విషయంలో వైసిపి ప్రభుత్వం అనుసరించిన తీరుకు వ్యతిరేకంగా కోర్టుల్లో దాఖలు చేసిన కేసులపై ఇప్పుడు రైతుల్లో చర్చ జరుగుతోంది. వేర్వేరు కోర్టుల్లో 100కుపైగా కేసులు ఉన్నప్పటికీ ప్రధానంగా సుప్రీం కోర్టులో ఆరు కేసులు, హైకోర్టులో ఒకటి ఉన్నాయి. ఇవిగాకుండా రైతులు వ్యక్తిగతంగా 100కుపైగా కేసులు దాఖలు చేశారు. ప్రభుత్వం మారడంతో పాటు, నూతన ప్రభుత్వం అమరావతికి అనుకూల వైఖరి తీసుకోవడంతో కేసులను ఏం చేద్దామనే చర్చ రైతుల్లో జరుగుతోంది. రాజధానిలో పనులకు ఈ కేసులే అడ్డంకిగా మారడంతో వాటిని ఉపసంహరించుకోవాలని రైతులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. దీనికి చట్టపరమైన ప్రక్రియ అవసరం ఉండటంతో ఆ మేరకు కసరత్తు చేస్తున్నారు. ప్లానుకు విరుద్ధంగా ఆర్-5 జోన్ ఏర్పాటు చేయడంపై రైతులు కోర్టును ఆశ్రయించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత చంద్రబాబు పాత ప్లాన్ ప్రకారమే రాజధాని నిర్మాణం చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో

ఆర్5 జోన్ అడ్డుతొలిగినట్టేనని రైతులు భావిస్తున్నారు. ఈ మేరకు పెట్టిన కేసులను వెనక్కి తీసుకున్నట్లు కోర్టులో పిటిషన్లు దాఖలు చేయాల్సిఉంది. అలా దాఖలు చేసిన తరువాత 90 రోజుల్లోపు ఎప్పుడైనా కేసులను కొట్టివేసే అవకాశం ఉంది.

ఇవి కాకుండా మూడు రాజధానుల అంశంపైనా సుప్రీం కోర్టులో కేసు ఉంది. ముఖ్యంగా రాజధాని పరిధి మొత్తాన్ని ఒక కార్పొరేషన్‌గా మారుస్తూ టిడిపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 217 చదరపు కిలోమీటర్లతోపాటు చుట్టుపక్కల గ్రామాలను అందులో కలపాలని నిర్ణయించింది. అయితే వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలోని గ్రామాలను మాస్టర్ ప్లాను నుండి విడదీసి మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి అందులో కలిపేసింది. దీనివల్ల రాజధాని ప్లానుకు విఘాతం కలుగుతుందని రైతులు సుప్రీం కోర్టును ఆశ్రయించి మరో పిటీషన్ దాఖలు చేశారు. కొండ వీటివాగు ముంపును పరిష్కరించలేదని ఒక కేసు, పూలింగులు రైతుల నుండి తీసుకున్న భూములకు రిటర్నబుల్ ప్లాట్లు తిరిగి ఇస్తానన్న సమయానికి ఇవ్వలేదని,వెంటనే ఇప్పించడంతోపాటు ఆలస్యానికి కొంత నష్టపరిహారం ఇప్పించాలని, ప్రతిగజానికి నష్టపరిహారం ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మరో పిటీషన్ దాఖలైంది. 2019లో రాజధాని పనులు నిలిపేశామని ప్రకటించిన తరువాత వేర్వేరు కాంట్రాక్టు కంపెనీలు అక్కడున్న సామాన్లను తరలించే ప్రక్రియ చేపట్టాయి. వాటిని నిలిపేయాలని, పనులు చేయకపోతే రైతులకు నష్టం వాటిల్లుతుందని, తరలింపును నిలిపేయాలని కోరుతూ మరొక పిటీషన్ దాఖలు చేశారు. వీటిల్లో ఆర్5 జోన్ ఏర్పాటు తప్ప మిగిలిన కేసులన్నీ సుప్రీం కోర్టులో ఉన్నాయి. వీటిన్నంటిని వెనక్కు తీసుకోవాల్సి ఉంది

రైతులపై 350 కేసులు

మూడు రాజధానుల ప్రకటన అనంతరం రైతులు ఆందోళనబాట పట్టారు. వారిపై అప్పటి వైసిపి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. ఎక్కడికక్కడ కేసులు నమోదు చేయడం పనిగా పెట్టుకుంది. ఇలా రాజధాని పరిధిలో రైతులపైనా, వారికి సహకరించిన వారిపైనా సుమారుగా 350కిపైగా కేసులు నమోదు చేసింది. ఇప్పుడు ప్రభుత్వం వాటిని వెనక్కు తీసుకోవాల్సి ఉంది. కేసులు ఎత్తేసే అంశంపై సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ఉండటంతో వాటికి అనుగుణంగా ఈ వ్యవహారం చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

పోలవరం ముంపు బాధితులను ఆదుకోండి

రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - ఎటపాక (అల్లూరి జిల్లా)



వీరాయిగూడెంలో మహిళలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక, రైతు సంఘం నాయకులు

పోలవరం ముంపు బాధితులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసేందుకు శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని వీరాయిగూడెం, నందిగామ, రాఘవాపురం గ్రామాల్లో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు పర్యటించారు. రైతులు, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు మాట్లాడుతూ.. పోలవరం ముంపు బాధితులమైన తమను ప్రభుత్వం ఆదుకునేలా చూడాలని నేతలను కోరారు. ఇప్పటికే ఉపాధి హామీ వంద రోజులు పూర్తయ్యాయని, వర్షా కాలంలో మూడు నెలలు కూలి పనులు దొరకవని, ఈ నేపథ్యంలో తమ గురించి ఆలోచించాలని కోరారు. మూడు సంవత్సరాలుగా వ్యవసాయంలో నష్టాలు వచ్చి తామంతా అప్పులపాలయ్యామని వీరాయిగూడెం గ్రామస్తులు తెలిపారు. వరదొస్తే మండలంలో తొలుత తమ గ్రామమే ముంపునకు గురవుతుందని, ముంపు జాబితాలో చేర్చి పునరావాసం కల్పించేలా చూడాలని కోరారు. నందిగామ రైతులు మాట్లాడుతూ గతంలో భూసేకరణలో తమ భూములను ప్రభుత్వానికి ఇచ్చామని, అప్పటి నుంచి వ్యవసాయానికి, పెట్టుబడికి బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదని, సబ్సిడీ రావడంలేదని, పంట నష్టపరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ముంపులో తమ గ్రామం ఉందని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని తాము ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అనంతరం కె.ప్రభాకర్ రెడ్డి, దడాల సుబ్బారావు మాట్లాడుతూ గ్రామస్తులు తెలియజేసిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు విద్యుత్ రాయితీ పునరుద్ధరణ

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

'ఎస్‌సి, ఎస్‌టిలకు విద్యుత్ షాక్' శీర్షికతో ప్రజాశక్తి మెయిన్ మొదటి పేజీలో జూన్ 23న ప్రచురితమైన వార్తకు ప్రభుత్వం స్పందించింది. తాజాగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన ఎస్‌సి, ఎస్‌టి వినియోగదారులకు బిల్లు రాయితీని ప్రభుత్వం పునరుద్ధరించింది. సిక్త్ సెప్ వ్యాలిడిటీని ప్రామాణికంగా తీసుకుని మేలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన అనేక మంది ఎస్‌సి, ఎస్‌టిలకు ఎపిసిపిడిసిఎల్ డిమాండ్ బిల్లు ఇచ్చింది. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం వెలువోలు దళితవాడకు చెందిన కుంపటి బాబూరావుకు రూ.250, కుంపటి బేబీసరోజినికి రూ.250, అదే గ్రామానికి చెందిన కట్టా అచ్చమ్మ (ఎస్‌టి)కు రూ.438 చెల్లించాలని బిల్లులు వచ్చాయి.

లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని చింతలమడకు చెందిన బండారు కోటేశ్వరరావుకు రూ.438 చెల్లించాలని డిమాండ్ నోటీసు వచ్చింది. తాజాగా జూన్ వినియోగానికి సంబంధించి ఎపిసిపిడిసిఎల్ బిల్లులు ఇచ్చింది. కుంపటి బాబూరావుకు రూ.258, కుంపటి బేబీ సరోజినికి రూ.226, కట్టా అచ్చమ్మకు రూ.463, బండారు కోటేశ్వరరావు రూ.470 రాయితీ ఇచ్చినట్లు బిల్లుల్లో పేర్కొంది. అయితే, వీరికి గత బిల్లుకు సంబంధించిన డిమాండ్‌ను రద్దు చేశారా? లేక బకాయిలుగా కొనసాగిస్తున్నారా అనేది విద్యుత్ అధికారులు స్పష్టం చేయలేదు.

10న ధర్నా

జయప్రదానికి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ అఖిలభారత కోర్కెల దినం సందర్భంగా ఆలిండియా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 10న జిల్లా, మండల స్థాయిలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బరావమ్మ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేతనాలు పెంచుతామని, ఐసిడిఎస్‌ను బలోపేతం చేస్తామని ఇచ్చిన హామీలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నెరవేర్చలేదని పేర్కొన్నారు. గ్రాట్యూటీ అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనపెట్టారని తెలిపారు.

రాష్ట్రంలో గత ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయనందునే 42 రోజులపాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించామని గుర్తు చేశారు. ప్రతి సమ్మె శిబిరం వద్దకు వచ్చిన టిడిపి నాయకత్వం తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని జిల్లాల్లో కిందిస్థాయి టిడిపి కార్యకర్తలు.. అంగన్‌వాడీలను రాజీనామాలు చేయాలని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

ఇప్పటికైనా రాజకీయ వేధింపులు ఆపాలని, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమ్మె కాలంలో ప్రభుత్వం మినిట్స్ కాపీలో అంగీకరించిన అంశాలకు జిఓలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం జరిగే ధర్నాల్లో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రాజధాని అమరావతి పరిధిలో 2,668 కిలోమీటర్ల రోడ్లు

- తొలి ప్రాధాన్యతగా తీసుకున్న ప్రభుత్వం
- ట్రంకు రోడ్లే 321 కిలోమీటర్లు
- ఎల్‌పిఎస్‌లో 2,300 కిలోమీటర్ల రోడ్లు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కీలకమైన కనెక్టవిటీతోపాటు, 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రోడ్లను పూర్తి చేయడంపై దృష్టి సారించింది. గతంలో మాదిరి విమర్శలకు తావివ్వకూడదనే ఉద్దేశంతో మొత్తం లేఅవుట్ ఏర్పాటుకు సిద్ధమవుతుంది. విజయవాడ పశ్చిమ ఔటర్ రింగురోడ్డు పూర్తి కావొస్తున్న నేపథ్యంలో ప్రాథమిక కనెక్టవిటీ సమస్య కొంత వరకు పరిష్కారమవుతుందని, రోడ్లను బాగు చేస్తే దాదాపు విమర్శలకు తావుండదని ఆలోచన చేస్తోంది. దీనిపై ఇటీవల మంత్రి నారాయణ ఆధ్వర్యాన సిఆర్‌డిఎ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. సీడ్ యాక్సెస్ రోడ్డుతోపాటు అంతర్గత రహదారుల విస్తరణనూ ప్రధాన అంశంగా తీసుకోవాలని నిర్ణయించింది. తొలుత రాజధాని రూపురేఖల కోసం రోడ్ల వెంట, ప్రధాన నిర్మాణాల ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్‌కు రూ.64 కోట్లతో టెండర్లు ఇచ్చారు. తాత్కాలికంగా అక్కడక్కడా జరుగుతున్నా.. పూర్తిస్థాయిలో జంగిల్ క్లియరెన్స్ చేయాల్సి ఉంది. రెండోదశలో ట్రంకు రోడ్లను నిర్మించాలని భావిస్తోంది. దీనిలో మేజర్ ఆర్టిరీయల్ సీడ్ యాక్సెస్ రోడ్డు (60 మీటర్లు లేదా 200 అడుగులు వెడల్పు) 72.97 కిలోమీటర్లు నిర్మించనున్నారు. రెండో దశలో 101 కిలోమీటర్ల ఆర్టిరీయల్ రోడ్లు (50 మీటర్ల వెడల్పు) నిర్మించనున్నారు. మూడోదశలో 147.21 కిలోమీటర్ల సబ్ ఆర్టిరీయల్ రోడ్లు (50 మీటర్లు) నిర్మిస్తారు. ఇవి మొత్తం 321.90 కిలోమీటర్ల దూరం ఉండనున్నాయి. ఈ రోడ్ల నిర్మాణంలో వేర్వేరు సదుపాయాల కల్పనను బట్టి కిలోమీటరుకు రూ.11 కోట్ల నుండి రూ.18 కోట్ల వరకూ అంచనాలు ప్రతిపాదించారు. గత ఐదేళ్లలో ధరల పెరుగుదల నేపథ్యంలో వీటి అంచనాల్లో పెరుగుదల ఉండొచ్చని మంత్రికి అధికారులు వివరించారు. వాటిపై వెంటనే నివేదిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ఇవి కాకుండా అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్ పరిధిలోని 1,575 ఎకరాల విస్తీర్ణంలో అంతర్గత రోడ్లు 47.44 కిలోమీటర్లు నిర్మించాల్సి ఉంటుంది. ఇక పూలింగు స్కీములో రైతులకు తిరిగి ఇచ్చిన ప్లాట్లలో 2,300 కిలోమీటర్ల రోడ్లు నిర్మించాల్సి ఉంది. ప్లాట్ల ఏరియాను బట్టి వీటిని ఎ, బి, సి, డి జోన్లుగా విభజించారు. ఇవి 12 మీటర్ల నుండి 25 మీటర్ల విస్తీర్ణం వరకూ ఉన్నాయి. వీటికి కిలోమీటరుకు రూ.కోటి వరకూ ఖర్చు చేయనున్నట్లు తెలిసింది.

టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో మరో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన ఘటనలో మరో ముగ్గురు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. దీంతో ఇప్పటి వరకు అరెస్టు చేసిన వారి సంఖ్య ఎనిమిదికి చేరింది. గుంటూరుకు చెందిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అనుచరులు జింకా సత్యం, తియ్యగూరగోపిరెడ్డి, లంకా లబ్బినాయుడును పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 56 మందిపై కేసులు నమోదు కాగా పలువురు ముఖ్య నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లి హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఫోన్‌లలో సిమ్ కార్డులు మార్చి కేవలం కుటుంబ సభ్యులకు, ముఖ్యనేతలకు మాత్రమే అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసుకుని రాష్ట్రం వదిలి వెళ్లిపోయారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి ముఖ్య అనుచరుడుగా ఉన్న వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య టిడిపి కార్యాలయంపై దాడిలో కీలక భూమిక పోషించారని సిసిటివిల పుటేజిలో వెల్లడైంది. అప్పిరెడ్డి, దేవినేని అవినాష్‌తోపాటు గుంటూరుకు చెందిన పలువురు కార్పొరేటర్లు, వారి భర్తలు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. వీరి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

కప్పట్రాళ్ల నాయుడు హత్య కేసు కొట్టివేత

కింది కోర్టు జీవిత ఖైదు తీర్పును రద్దు చేసిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ఉమ్మడి ఎపిలో పెను సంచలనం రేపిన కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల గ్రామలో 11 మంది దారుణ హత్య కేసులో 17 మందికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ కింది కోర్టు విధించిన తీర్పును హైకోర్టు రద్దు చేసింది. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామస్తుడు వెంకటప్పనాయుడు, మద్దిలేటినాయుడు కుటుంబాల మధ్య ఫ్యాక్షన్ వైరాలున్నాయి. ఈ నేపథ్యంలో వెంకటప్పనాయుడు మరో పది మంది విచక్షణారహితంగా హత్యకు గురయ్యారు. ఫ్యాక్షన్ గొడవ కారణంగా 2008 మే 17న పాలెగారి వెంకటప్పనాయుడు సహా 11 మందిని వాహనాలతో ఢీకొట్టి, బాంబులు వేసి, వేట కొడవళ్లతో కిరాతకంగా హతమార్చారు. హత్య చేశారనే అభియోగాలతో మాధాపురం మద్దిలేటి నాయుడు ఇతరులపై దేవనకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్యా నేర అభియోగాలను కర్నూలు జిల్లా ఆదోని రెండో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు నిర్ధారిస్తూ తీర్పు చెప్పింది. దీంతో మద్దిలేటి నాయుడు సహా 17 మందికి జీవిత కారాగార కఠిన శిక్ష విధిస్తూ 2014 డిసెంబరు 10న తీర్పు వెలువరించింది. ఈ తీర్పును దోషులు సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె సురేష్ రెడ్డి, జస్టిస్ బివిఎల్‌ఎన్ చక్రవర్తితో కూడిన ద్విసభ్య ధర్మాసనం కఠిన జీవిత కారాగార శిక్షను రద్దు చేస్తూ తీర్పు చెప్పింది.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎన్.రామారావు

సెయిల్‌లో విలీనంతోనే శాశ్వత పరిష్కారం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సెయిల్‌లో విలీనం చేయడమే శాశ్వత పరిష్కారమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1241వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో స్టీల్ సిఎంఎం, సిఎంఇ, సిఆర్‌ఎంపి, లూబ్రికేషన్, హైడ్రాలిక్స్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి పూర్తి సామర్థ్యంతో నడిపితే లాభాలబాట పడుతుందన్నారు. రా మెటీరియల్‌ను తగినంతగా సరఫరా చేయాలని కోరారు. ప్లాంట్ పరిరక్షణ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సి ఉందని తెలిపారు. ప్రయివేటీకరణ చర్యలను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, విళ్ల రామ్మోహన్ కుమార్, శ్రీనివాస్ నాయుడు, సంజీవరావు, ఎన్ఎస్.అప్పారావు, చిన్నంనాయుడు, వాసు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

వర్షంలోనూ సాగిన రాక్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - సామర్లకోట

జోరు వర్షంలోనూ రాక్ సిరామిక్స్ కార్మికులు ధర్నాను కొనసాగించారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల నిరసన శనివారంతో 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ.. రాక్ సిరామిక్స్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికులను వేధిస్తోందన్నారు. తక్షణం ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. నినాదాలు చేస్తున్న కార్మికుల వద్దకు రాక్ సిరామిక్స్ సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ పూర్ణచంద్రరావు వచ్చి మైక్ లాక్కునే ప్రయత్నం చేశారు. దీంతో ఆయనను కార్మికులు అడ్డుకున్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ.. ప్రశాంతంగా ధర్నా చేసుకుంటున్నామని, మైక్ లాక్కొని కార్మికులను రెచ్చగొట్టడం మంచిది కాదన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కార్మికులను విధుల్లోకి తీసుకునేంత వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ధర్నాకు ప్రజానాట్యమండలి మద్దతు తెలిపి, విప్లవ గీతాలను ఆలపించింది.



నారాయణలో అధ్యాపకులుగా ఐఐటియన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు తమ విద్యాసంస్థల్లో ఐఐటియన్లను అధ్యాపకులుగా నియమించుకున్నట్లు నారాయణ విద్యాసంస్థలు ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. విద్యా రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా అర్థవంతంగా, విశ్లేషణాత్మకంగా బోధించే అధ్యాపకుల కొరతను దృష్టిలో ఉంచుకుని ఐఐటి, ఎన్‌ఐటిలలో బిటెక్, ఎంటెక్ పూర్తి చేసిన 180 మంది ప్రతిభావంతులైన అభ్యర్థులను క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా తీసుకున్నామని నారాయణ విద్యాసంస్థల సిఇఒ పునీత్ కొత్తప తెలిపారు. నారాయణ నవతరం పేరుతో ఈ నియామకాలు చేపట్టామన్నారు. అన్ని పోటీ పరీక్షల్లో కీలకమైన గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులకు గాను ట్రైనీ ఫ్యాకల్టీ అభ్యర్థులను నియమించుకున్నామన్నారు. వీరి కోసం ప్రత్యేకంగా ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించామన్నారు.

నారాయణ విజన్‌కు ఇది అద్దం పడుతుందని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ పి సింధూర నారాయణ తెలిపారు. రాబోయే కాలంలోని అవసరాలను గుర్తించి నేటి నుండే వనరులను సమకూర్చుకోవటం తమ ముందు చూపునకు నిదర్శనమన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడికి ఉండవల్సిన ముఖ్య లక్షణాలను గురించి మరో డైరెక్టర్ శరణి నారాయణ వివరించారు. రాబోయే 90 రోజుల్లో ట్రైనీ ఫ్యాకల్టీ అభ్యర్థులకు తరగతి గది శిక్షణ ఇవ్వనున్నామన్నారు. రాబోయే తరాలను విజయం వైపు నడిపించాల్సిన బాధ్యత కొత్తగా ఎంపికయిన అభ్యర్థులపై ఉందని జైపూర్‌లోని కోచింగ్ సెంటర్‌ల చీఫ్ అకడమిక్ ఆఫీసర్ అశిష్ అరోరా అన్నారు.

పింఛనుదారులకు అండగా ఉంటే దాడులు చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులను కోరారు. అనంతరం ఆస్పత్రి నుండి జిల్లా పోలీసు కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి అదనపు ఎస్‌పి లక్ష్మీపతికి వినతిపత్రం అందజేశారు. రామారావుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, బాధితుడికి రక్షణ కల్పించాలని కోరారు. ఇంటిపై దౌర్జన్యానికి పాల్పడి రామారావుపైనా, ఆయన తల్లిపైనా దాడికి పాల్పడిన నిందితులను హత్యాయత్నం కేసులు పెట్టి అరెస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం ఇంటింటికీ సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తే, పల్నాడు జిల్లా పగటిచర్లలో టిడిపి నాయకులు చిగురుపాటి ఆదినారాయణ తన ఇంటి వద్దకు లబ్ధిదారులు రావాలని గ్రామంలో చాటింపు వేయించడం, వారిని తన ఇంటి చుట్టూ తిప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు. టిడిపి నాయకుని ఇంటి వద్ద పింఛన్ల పంపిణీకి అధికారులు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. పింఛను కోసం వచ్చిన కొంతమందిపై టిడిపి నాయకులు వివక్ష చూపడం, దుర్భాషలాడడం తగదన్నారు. తమకు న్యాయం చేయాలని కామినేని రామారావును బాధితులు ఆశ్రయించగా, ఆయన సూచన మేరకు వారు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారని శ్రీనివాసరావు తెలిపారు. దీంతో, లబ్ధిదారులకు పింఛను పంపిణీ జరిగిందన్నారు. దీన్ని ఓర్వలేని టిడిపి నాయకులు 70 ఏళ్ల వయసున్న రామారావుపై కక్షపూరితంగా దాడి చేయడాన్ని, అడ్డువచ్చిన ఆయన 90 ఏళ్లని పక్కకు నెట్టివేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా ఎక్కడ పేదలకు అన్యాయం జరిగినా సిపిఎం నాయకులు అక్కడ ఉంటారన్నారు. తప్పులపై ఫిర్యాదు చేస్తే దాడులు చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం ఇదే రీతిలో టిడిపి వారిపై దాడికి పాల్పడిందని, సిపిఎంను ఆశ్రయించిన టిడిపి వారికి అండగా నిలబడ్డామని వివరించారు. కక్షపూరిత రాజకీయాలు చేసి వైసిపి అధికారం కోల్పోయిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి స్పందించి మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా గ్రామాలలో టిడిపి వారిని అదుపు చేయాలని కోరారు. టిడిపి నాయకులు తమ అనుచరులకు ఉద్యోగాలు కట్టబెట్టేందుకు స్కీం వర్కర్లను ఇబ్బందులు పెడుతుండడం తగదన్నారు. సిపిఎం నాయకులపై దాడులు ఆపకపోతే ఆత్మరక్షణ ఎలా చేసుకోవాలో తమకు తెలుసన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ పోలీసులు ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై రాధాకృష్ణ, ఎ లక్ష్మేశ్వరరెడ్డి, జి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బాపట్ల



రావి పేరయ్య (ఫైల్)

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన బాపట్ల మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భర్తిపూడి గ్రామానికి చెందిన రావి పేరయ్య(67) ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.పది లక్షల వరకు అప్పులు చేశారు. గత రెండేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలతో ఆశించిన మేర పంట దిగుబడి రాకపోవడంతో అప్పులకు వడ్డీల భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి పెరగడం, అప్పులు తీరే దారిలేకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

ప్రజాశక్తి - చింతూరు (అల్లూరి సీతారామరాజు)

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం పేగ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి చెందిన సోడి బామన్ దేవల్, జడ్డి నాగేశ్వరరావులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను చింతూరు డివిజన్ ఎఎస్‌పి కెవి.మహేశ్వరరెడ్డి శనివారం మీడియాకు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. సోడి బామన్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గుండం గ్రామానికి చెందినవారు. సిపిఐ (మావోయిస్టు) పార్టీలో కుంట ఏరియాలో పనిచేస్తున్నారు. జడ్డి నాగేశ్వరరావు చింతూరు మండలం పేగ పంచాయతీ నారకొండ గ్రామానికి చెందినవారు. సోడి బామన్ 2015 నుంచి మావోయిస్టు పార్టీలో పలు బాధ్యతల్లో పని చేశారు. సుమారు 24 చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నారు. 2017 మార్చిలో ఛత్తీస్‌గఢ్‌లోని బంకుపర అటవీ ప్రాంతంలో పోలీసులపై జరిపిన కాల్పుల ఘటనలో పాల్గొన్నారు.

ఈ ఘటనలో 12 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు చనిపోయారు. మల్లంపేట గ్రామ శివారు అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా చివరకు సహచరుడు నాగేశ్వరరావుతో కలిసి పట్టుబడ్డారు. వారి నుంచి పేలుడు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఎఎస్‌పి తెలిపారు.

వ్యవసాయ కార్మికులకు కార్పొరేషన్ ఎప్పుడు?

- మేనిఫెస్టోలో టిడిపి కూటమి హామీ
- కూలీల్లో ఉత్కంఠ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వ్యవసాయ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ నెలకొల్పుతామంటూ టిడిపి-జనసేన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో సదరు హామీపై చర్చ మొదలైంది. 'రైతు కూలీల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పర్చి రాయితీలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తాం' అని వాగ్దానం చేశారు. దాంతో ప్రభుత్వం నెలకొల్పే కార్పొరేషన్ ఏ విధంగా ఉండబోతోంది, లబ్ధిదారులను ఏ విధంగా గుర్తిస్తారు, ఏఏ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ప్రవేశపెడతారు అనే విషయాలపై వ్యవసాయ కార్మికులు ఉత్కంఠగా ఉన్నారు. మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు, ప్రజాప్రతినిధులు, అధికారులను ఆసక్తితో ఆరా తీస్తున్నారు. కాగా ఇప్పటి వరకు ఆ అంశంపై ప్రభుత్వంలో చర్చ లేదని, ఈ కాలంలో ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు నిర్వహిస్తున్న శాఖాపరమైన చర్చల్లో ప్రస్తావనకు రాలేదని, తొలి కేబినెట్ భేటీలో ఆ ఊసు లేదని సమాచారం. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనైనా ప్రకటన వెలువడుతుందా అనే ప్రశ్నలు వస్తున్నాయి.

కోటి 40 లక్షల మంది

2010-11లో వెలువడిన గణాంకాల మేరకు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కోటి పది లక్షల వరకు వ్యవసాయ కార్మికులున్నారు. ఇప్పటికి వారి సంఖ్య కోటి 40 లక్షల వరకు చేరుకుందని అంచనా. అచ్చంగా వ్యవసాయ సంబంధ పనులు చేసే కూలీలు 32 శాతం ఉంటారు. ఆ లెక్కన 40 లక్షల వరకు కేవలం వ్యవసాయ పనులపైనే ఆధారపడ్డ వారున్నారు. మిగతా కార్మికులు వ్యవసాయ పనులతో పాటు ఇతర పనులు కూడా చేసుకొని పొట్ట పోసుకుంటున్నారు. వ్యవసాయ కూలీలలో 90 శాతానికిపైన ఎస్‌సి, ఎస్‌టి, బిసీలే. వీరిలోనూ గణనీయమైన సంఖ్యలో మహిళలున్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో వ్యవసాయ పనులు తగ్గుతున్నాయి. ఒకప్పుడు ఉత్తరాంధ్ర, రాయలసీమ నుంచే కూలీలు పనుల కోసం వేరే రాష్ట్రాలకు వలసలు వెళ్లేవారు.



ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచీ పనుల కోసం రాష్ట్రం దాటి పోతున్నారు. జాతీయ స్థాయిలో ఉపాధి హామీ చట్టం ప్రకారం గ్రామాల్లో పనుల్లేని సమయాల్లో ఏడాదికి కనీసం వంద రోజులు పని కల్పించాలి. కరువు, విపత్తులొచ్చినప్పుడు పని దినాలు, వేతనాలు పెంచాలి. అవేమీ అమలుకు నోచుకోవట్లేదు.

భవన నిర్మాణ కార్మికుల బోర్డు తరహాలోనా?

రైతు కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న టిడిపి కూటమి హామీతో వారిలో ఆసక్తి నెలకొంది. ఎప్పుడు కార్పొరేషన్ ఉనికిలోకొచ్చి తమకు ఆసరా అవుతుందా అని లక్షలాది మంది ఎదురుచూస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల కోసం ఉన్న సంక్షేమ బోర్డు తరహాలోనే వ్యవసాయ కార్మికుల కార్పొరేషన్ ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. కేరళలో వ్యవసాయ కార్మిక సంక్షేమ బోర్డు దేశానికి ఆదర్శంగా ఉందని గుర్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాల నిర్ణయం, అమలు బాధ్యత ప్రభుత్వానిది, కార్మికశాఖది. చాలా ఏళ్ల నుంచి కనీస వేతనాల నిర్ణయం లేదు. దాంతో కార్మికులు తమ శ్రమకు న్యాయంగా దక్కాల్సిన దినసరి కూలి అందక ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ అంశం కూడా కార్పొరేషన్ పరిధిలోకి చేరుస్తారా అనే ప్రశ్నలు కార్మికుల నుంచి వినపడుతున్నాయి.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి

ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమగోదావరి)

అత్యున్నత విద్యతోపాటు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని బిఆర్‌ఎంవి మున్సిపల్ హైస్కూల్లోని విద్యార్థులకు బ్యాగులు, దుస్తులను మంత్రి అందజేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు, బాలికలతో కలిసి మంత్రి భోజనం చేశారు. వైసిపి నేతలు నాడు-నేడు పథకం పేరుతో తాత్కాలిక రంగులు వేసి, హంగులు చేసి నిధులు దోపిడీ చేశారని విమర్శించారు. జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రంలో ఆరు లక్షల మంది విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యారన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఝాన్సీ, ఎంఇఒ వీరాస్వామి, నేతలు పాల్గొన్నారు.

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యశిక్షణ

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట



టిటిడిసిలో మొక్కల విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారికి ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. నిరుద్యోగ యువతకు త్వరలో భారీ ఎత్తున ఉపాధి శిక్షణ కల్పించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. విజయనగరంలోని టిటిడిసి స్కిల్ కాలేజీని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. తరగతి గదులను, వసతులను పరిశీలించారు.

సీడాప్ ద్వారా జరిగే శిక్షణా కార్యక్రమాలను డిఆర్‌డిఎ పిడి ఎ.కల్యాణచక్రవర్తి మంత్రికి వివరించారు. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో దీన దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డిడియు-జికెవై) పథకం కింద ఇస్తున్న శిక్షణా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ఎస్‌బిఐ ఆర్‌సెట్టి కేంద్రాన్ని సందర్శించి సందర్శించారు. అక్కడ జరుగుతున్న శిక్షణ, లభిస్తున్న ఉద్యోగాల గురించి ఆ సంస్థ డైరెక్టర్ జిబివి రమణ వివరించారు. అనంతరం బొకే మొక్కల విక్రయ కేంద్రాన్ని సందర్శించి ఆకర్షణీయమైన బొకేలను తయారు చేస్తున్నందుకు నిర్వాహకులను మంత్రి అభినందించారు. టిటిడిసి వసతి కేంద్రాన్ని, దుస్తుల తయారీ సెంటర్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లోని డిమాండ్‌కు అనుగుణంగా సరికొత్త కోర్సులతో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి శిక్షణ ఇచ్చి, వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు కషి చేస్తామన్నారు.

'విషాద'యాత్ర

- అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- నలుగురు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్/రామాపురం



ప్రమాదం నుజ్జునుజ్జైన కారు పరిశీలిస్తున్న మంత్రి

విహారయాత్ర కాస్త విషాదయాత్రగా మారింది. అన్నమయ్య జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు స్నేహితులు అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం తెల్లవారుజామున కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం కొండవాండ్లపల్లి వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కడప నుంచి ఐదుగురు స్నేహితులు విహార యాత్ర కోసం కారులో గువ్వలచెరువు ఘాట్‌కు వెళ్లారు. రాయచోటిలోని తమ బంధువుల ఇంటికి వెళ్దామని స్నేహితుడు చెప్పడంతో అటుగా వెళుతుండగా మార్గమధ్యంలో కారును వెనుక నుంచి టిప్పర్ ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న పఠాన్ అఫ్రోజ్ ఖాన్ (30), షేక్ అలీం (28), ఆంజనేయులు నాయక్ (28), జితేంద్ర కుమార్ (24) అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రవాణా శాఖ మంత్రి పరామర్శ

మృతుల కుటుంబ సభ్యులను రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.25 వేల చొప్పున తన సొంత నిధులతో సాయం చేశారు. ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

టూరిస్టు బస్సు బోల్తా

- ఇద్దరు మృతి - 21 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పెద్దపంజాణి (చిత్తూరు)



దక్షిణాది రాష్ట్రాల పుణ్యక్షేత్రాల సందర్శనకు యాత్రికులతో బయలుదేరిన టూరిస్టు బస్సు చిత్తూరు జిల్లాలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా..21 మందికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు..

కర్ణాటక రాష్ట్రం తుముకూరు జిల్లా పావగడ తాల్లూకాకు చెందిన ప్రయివేట్ టూరిస్టు ఏజెంట్..దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న పుణ్యక్షేత్రాల సందర్శనకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు 50 మంది యాత్రికులతో శుక్రవారం రాత్రి తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పేరూరు నుంచి బయలుదేరారు. శనివారం ఉదయం కాణిపాకం వెళ్తుండగా చిత్తూరు జిల్లా పుంగనూరు - పలమనేరు జాతీయ రహదారి బసవరాజుకండ్రిగ వద్ద బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సత్యసాయి జిల్లా రొద్దం పంచాయతీ చిన్నగువ్వలపల్లికి చెందిన రామంజమ్మ (58), కర్ణాటక రాష్ట్రం తుముకూరు జిల్లా పావగడ తాల్లూక మురరాయనిహళ్ళికి చెందిన నరసింహారెడ్డి (68) అక్కడికక్కడే మృతి చెందారు. 21 మందికి తీవ్రగాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద ఘటనపై సంబంధిత శాఖ అధికారులతో సెల్‌ఫోన్ ద్వారా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆరా తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రయివేటు'కే పెద్దపీట

- వెళ్లిపోయిన పరిశ్రమలకు మళ్లీ పిలుపు
- త్వరలో నూతన పారిశ్రామిక విధానం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రయివేటు పెట్టుబడుల ద్వారానే సాధించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసినట్లు సమాచారం. ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను రప్పించేందుకు ప్రయత్నాలు సాగిస్తూనే... మరోవైపు ప్రయివేటు పెట్టుబడులను ఆహ్వానించాలని నిర్ణయించారు. దీనికోసం పరిశ్రమల శాఖతోపాటు, మౌళికాభివృద్ధి శాఖ కూడా చర్యలు ప్రారంభించింది. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుకాకపోవడం, అప్పటికే ఉన్న కొన్ని పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోవడంతో అభివృద్ధి కుంటుబడిందన్న విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే.. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని కొత్తగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన సంస్థలతో సంప్రదింపులు ప్రారంభించిన అధికారులు, కొత్త సంస్థలను ఆకర్షించే ప్రయత్నాల్లో భాగంగా ఫైళ్లు కదుపుతున్నట్లు తెలిసింది. మౌళికాభివృద్ధి రంగంలో పెట్టుబడుల కోసం కావాల్సిన బిడ్లపై దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా పర్యాటక, ఇంధన, డెయిరీ, పరిశ్రమలు వంటి రంగాలకు సంబంధించి కొన్ని ముసాయిదా బిడ్లను కూడా లాంఛనంగా సిద్ధంచేసి ముఖ్యమంత్రికి పంపించినట్లు సమాచారం. ఈ ఫైళ్లకు ముఖ్యమంత్రి నుంచి ఆమోదం లభించిన వెంటనే పూర్తిస్థాయి కార్యాచరణ ప్రారంభిస్తామని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

త్వరలోనే పాలసీలో మార్పులు

ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉన్న పారిశ్రామిక విధానంలో మార్పులు తీసుకురావాలని నిర్ణయించారు. ఈ పాలసీ ఈ ఏడాది చివరి వరకు ఉన్నప్పటికీ ముందుగానే సమూల మార్పులు తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిసింది. కొత్తగా రాష్ట్రానికి వచ్చే వారికి అందించాల్సిన ప్రోత్సాహకాలను మరింతగా పెంచాలని భావిస్తున్నారు. భూమిని తక్కువ ధరకే అందించడంతోపాటు, నీరు, విద్యుత్, రహదారి సౌకర్యాలు వంటివి కూడా గతం కన్నా మెరుగ్గా అందించాలని భావిస్తున్నారు.

ఆ రెండు శాఖలే కీలకం

అభివృద్ధి రంగంలో పరిశ్రమలశాఖ, మౌళికాభివృద్ధి-పెట్టుబడుల శాఖలపైనే కీలకంగా దృష్టి సారిస్తున్నారు. ఈ రెండు శాఖల ద్వారా కీలక పెట్టుబడులు సాధించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ శాఖల అధికారులతో ప్రాథమిక సమీక్షలు కూడా నిర్వహించినట్లు తెలిసింది. ముందుగా ఇతర రాష్ట్రాల నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తూ, తరువాత విదేశీ పెట్టుబడులపైనా దృష్టి సారించాలని యోచిస్తున్నారు.

ఏడు శాతం వృద్ధితో ఉద్యోగాలు సరిపోవు

- ఉపాధిని పెంచడానికి సమిష్టి చర్యలవసరం
- ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయాలి
- ఏడాదికి 1.2 కోట్ల కొత్త జాబ్‌లు సృష్టించాలి
- సిటీ గ్రూపు రిపోర్టు



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ ఏడు శాతం వృద్ధి చెందినప్పటికీ.. ఆ స్థాయిలో ఉద్యోగాల కల్పన జరగడం లేదని స్పష్టమవుతోంది. వచ్చే దశాబ్దంలో ఆ స్థాయిలో దేశం వృద్ధి చెందుతున్నప్పటికీ.. శ్రామికశక్తికి తగినంత ఉద్యోగాలను సృష్టించడానికి దేశం చాలా కష్టపడాల్సి వస్తుందని సిటీ గ్రూపు ఓ రిపోర్టులో వెల్లడించింది. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశానికి ఉపాధిని పెంచడానికి మరింత సమిష్టి చర్యలు అవసరమని సూచించింది.

శ్రామిక మార్కెట్‌లోకి కొత్తగా ప్రవేశించిన వారి సంఖ్యను స్వీకరించడానికి భారతదేశం వచ్చే దశాబ్దంలో సంవత్సరానికి సుమారు 1.2 కోట్ల ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉందని అంచనా వేసింది. ప్రస్తుత 7 శాతం వృద్ధి రేటు ఆధారంగా భారత్ సంవత్సరానికి 80-90 లక్షల ఉద్యోగాలను మాత్రమే సృష్టించగలదని సిటీ బ్యాంక్ ఆర్థికవేత్తలు సమీరన్ చక్రవర్తి, బకర్ జైదీ ఓ రిపోర్టులో పేర్కొన్నారు. భారతదేశంలో సృష్టించబడుతున్న ఉద్యోగాల నాణ్యత మరొక సవాలుగా ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయ రంగం 20 శాతం కంటే తక్కువ వాటాను కలిగి ఉన్నప్పటికీ.. ఇప్పటికీ 46 శాతం మంది శ్రామికశక్తి ఉపాధి పొందుతున్నట్లు అధికారిక గణంకాలు చెబుతున్నాయి. 2023లో మొత్తం ఉద్యోగాలలో తయారీ రంగం 11.4 శాతం వాటాను కలిగి ఉంది. ఇది 2018 కంటే తక్కువ వాటా అని గణాంకాలు చెబుతున్నాయి. దీంతో కరోనా నాటి సంక్షోభం నుండి ఈ రంగం తిరిగి పుంజుకోలేదని స్పష్టం చేస్తున్నాయి.

ప్రభుత్వ, బ్యాంకింగ్, విద్యా, వైద్యం, తయారీ తదితర సంఘటిత (అధికారిక) రంగంలో 25.7 శాతం మంది పని చేస్తున్నారు. కాగా.. ఇందులో కోవిడ్‌కు ముందు కంటే ఇప్పుడు తక్కువ మంది వ్యక్తులు పని చేస్తున్నారు. ఈ రంగంలో ఉద్యోగాల కల్పన కనీసం 18 సంవత్సరాల కనిష్ట స్థాయికి తగ్గిందని సిటీ గ్రూపు తెలిపింది. 58.2 కోట్ల మంది స్వయం ఉపాధి కల్పనతో బ్రతుకుతున్నారు. దేశంలో దాదాపు 12.2 కోట్ల మంది మాత్రమే సంఘటిత రంగంలో పని చేస్తున్నారు.

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నిరుద్యోగం ముఖ్యంగా ఓటర్లలో ప్రధాన ఆందోళన కలిగింది. ఈ ప్రభావం బిజెపి సీట్లు భారీగా తగ్గడానికి కారణమయ్యింది. ఈ ఏడాది మేలో దేశంలో నిరుద్యోగ రేటు ఏకంగా 9.2 శాతానికి ఎగిసిందని సిఎంఐఇ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. ముఖ్యంగా 20-24 ఏళ్ల మధ్య వారిలో నిరుద్యోగ రేటు ఏకంగా 40 శాతం కంటే ఎక్కువగా ఉండటం ఆందోళనకరం.

10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ

దేశంలో ఉద్యోగ కల్పన పెంచడానికి సిటీ గ్రూపు పలు సూచనలు చేసింది. తయారీ రంగాల ఎగుమతి సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, విదేశీ కంపెనీలను ఆకర్షించడానికి ప్రోత్సాహకాలను పొడిగించాలని పేర్కొంది. కనీసం 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని సిటీ గ్రూపు ఆర్థికవేత్తలు సూచనలు చేశారు. బహుళ ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

సమస్యల పరిష్కారానికి సిఎంలు ముందుకు రావడం మంచి పరిణామం

- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజకీయాలకు తావు లేకుండా సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ముందుకు రావడం మంచి పరిణామమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆనాడు దేశంలో జమ్మూ అంతర్భాగంగా ఉండాలని ఉద్యమ రూపంలో తీసుకెళ్లిన వ్యక్తి అని అన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విభజన చట్టంలోని అంశాలు, నీటి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు స్నేహపూర్వకంగా చర్చలు జరపాలని అన్నారు.

విద్యుత్ బిల్లులు యుపిఐ యాప్‌లలో చెల్లించొద్దు

- సిపిడిసిఎల్ సిఎమ్‌డి చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ బిల్లులను ఫోన్‌పే, గూగుల్ పే, పేటిఎం ఇతర యుపిఐ యాప్‌లలో చెల్లించొద్దని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎపిసిపిడిసిఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టరు కెవిఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మార్గదర్శకాల ప్రకారం ఈ యాప్‌లలో ఎపిసిపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్ డిస్కామ్‌ల పేర్లు కనిపించవని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వినియోగదారులు రెండు విధాల ఆన్‌లైన్ పద్ధతుల ద్వారా బిల్లులు చెల్లించవచ్చునని వివరించారు. ప్లే స్టోర్ నుంచి ఎపిసిపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్ కన్జ్యూమర్ యాప్‌ల ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు. డిస్కమ్‌ల వెబ్‌సైట్ నుంచి బిల్లులు చెల్లించే సమయంలో ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం యుపిఐ యాప్‌లను ఉపయోగించవచ్చునని తెలిపారు. అలాగే తమ ఇఆర్‌ఒ కౌంటర్, ఎస్‌సిఎం ఏజెన్సీస్, ఆర్‌ఎస్‌డిపి కౌంటర్, ఈపే కౌంటర్, ఇసిఎస్‌సి, మీసేవ కౌంటర్, తావ్యాలెట్ కౌంటర్ ద్వారానూ చెల్లించవచ్చన్నారు. యుపిఐ యాప్‌ల ద్వారా నేరుగా బిల్లులు చెల్లించేలా డిస్కమ్‌లు బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నాయని వివరించారు. ఒప్పందాలు జరిగిన తరువాత వినియోగదారులకు పాత పద్ధతిలో యుపిఐ యాప్‌ల ద్వారా చెల్లించే వీలు ఉంటుందని వెల్లడించారు. వినియోగదారులను చైతన్య పరిచేందుకు కరపత్రాల పంపిణీ, సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు.

టెల్కోల టారిఫ్‌ల పెంపుతో భారం

- పెంచిన ఛార్జీలను వెనక్కి తీసుకోవాలి
- బిఎస్‌ఎన్‌ఎల్‌ఇయు డిమాండ్



హైదరాబాద్ : రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు తమ టారిఫ్‌ల పెంపుదలతో సామాన్య ప్రజలపై భారం పడుతుందని బిఎస్ ఎన్ఎల్ ఇయు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రయివేటు టెల్కోలు పెంచిన చార్జీలను వెనక్కి తీసుకోవాలని బిఎస్ ఎన్‌ఎల్‌ఇయు టిజి సర్కిల్ ప్రెసిడెంట్ జూలపల్లి సంపత్‌రావు, గుత్తా సాంబశివరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అంశమై సామాన్య ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. పెంచిన ధరలను తగ్గించాలి. ప్రజల కోసం తక్కువ ధరలతో చౌకగా ఉండేలా బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థ 4జి, 5జి సేవలను అందుబాటులోకి తెచ్చేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇటీవల రిలయన్స్ జియో తన టారీఫ్‌లను 25 శాతం వరకు ఎయిర్‌టెల్ 21 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే. ఈ టారిఫ్ పెంపునతో ఆయా కంపెనీలు రూ.20,000 కోట్ల అదనంగా లాభం పొందుతాయని బిఎస్‌ఎన్‌ఎల్‌ఇయు పేర్కొంది. తమ టారిఫ్‌లను ఇంత భారీగా పెంచడానికి వారికి తమ లాభాపేక్ష తప్పా ఎటువంటి కారణం ఉండదని తెలిపింది. 2023 ముగింపు నాటికే దేశ వ్యాప్తంగా బిఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలను అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించి ఏడాది అవుతోన్న ఇప్పటికీ ఈ సేవలు పూర్తిగా ప్రారంభం కాలేదని ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే 4జి, 5జి సేవలను అందుబాటులోకి తేవాలని బిఎస్‌ఎన్‌ఎల్‌ఇయు డిమాండ్ చేసింది.

పిఎన్‌బికి ఆర్‌బిఐ రూ.1.31 కోట్ల జరిమానా



న్యూఢిల్లీ: దేశంలోనే రెండో దిగ్గజ ప్రభుత్వ రంగ బ్యాంక్ పిఎన్‌బికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) రూ.1.31 కోట్ల జరిమానా విధించింది. ఆర్‌బిఐ నిబంధనలు పాటించనందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌పై చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొంది. రుణాలు, అడ్వాన్సులకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిపింది. ఖాతాదారుల చిరునామాలకు సంబంధించిన రికార్డులను భద్రపరచడంలో పిఎన్‌బి విఫలమయినట్లు ఆర్‌బిఐ పేర్కొంది. పిఎన్‌బితో పాటు గుజరాత్ రాజ్య కర్మచారి కోఆపరేటివ్ బ్యాంక్, రోహికా సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ (బిహార్), నేషనల్ కో ఆపరేటివ్ బ్యాంక్ (మహారాష్ట్ర), బ్యాంక్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ బ్యాంక్‌లకు (పశ్చిమ బెంగాల్)కు ఆర్‌బిఐ జరిమానా విధించింది.

చెడు సంప్రదాయానికి చంద్రబాబు నాంది

- పద్ధతి మార్చుకోవాలని జగన్ హెచ్చరిక

ప్రజాశక్తి - కడప అర్బన్



ఆస్పత్రిలో గాయపడిన కార్యకర్తను పరామర్శిస్తున్న జగన్

రాష్ట్రంలో మునుపెన్నడూ లేని చెడు సంప్రదాయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాంది పలికారని, ఈ పద్ధతి మార్చుకోవాలని మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. వైఎస్‌ఆర్ జిల్లా వేంపల్లెలో టిడిపి నాయకుల దాడిలో గాయపడిన వైసిపి కార్యకర్త వేంపల్లి అజయ్‌కుమార్‌రెడ్డిని జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. కడపకు మూడు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన ఆయన శనివారం రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. బాధితుని కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ.. అజయ్‌కుమార్‌రెడ్డి వైసిపికి ఓటు చేశారన్న ఒకే ఒక్క కారణంతో దాడి చేశారని అన్నారు. ఎన్నికల తరువాత పులివెందులలో ఇలాంటి దాడులు గతంలో ఎన్నడు లేవని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత దాడులను ప్రోత్సహిస్తున్నారని, రాష్ట్రంలో భయాకన వాతావరణం సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. అధికారం మారిన రోజున అవి చంద్రబాబుకు చుట్టుకుంటాయని హెచ్చరించారు. మోసపూరిత హామీలతో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ప్రతి మహిళలకు నెలకు రూ.1,500, రైతు భరోసా, అమ్మ ఒడి, నిరుద్యోగ భృతి ఏమైందని నిలదీశారు. దాడులపై కాకుండా ఇచ్చిన హామీలపై దష్టిసారించాలని హితవు పలికారు. జగన్ వెంట కడప ఎంపి అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌టిసి మాజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

ఎంపిఎల్‌కు ఎఫ్‌టిసిసిఐ అవార్డు



హైదరాబాద్ : మహాలక్ష్మి ప్రొఫైల్స్ లిమిటెడ్ (ఎంపిఎల్) పెద్ద పరిశ్రమల విభాగంలో ఎఫ్‌టిసిసిఐ అవార్డును దక్కించుకుంది.

పారి శ్రామిక అన్ని రకాల పనితీరులో మెరుగైన ప్రగతిని కనబర్చినందుకు ఈ ఎక్సలెన్సీ అవార్డును తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఎంపిఎల్ యాజమానులు బనితా అగర్వాల్, సౌమ్య అగర్వాల్, శ్రియా అగర్వాల్ అవార్డును అందుకున్నారు. 1959లో ఆంధ్రప్రదేశ్‌లో మొదటి రీ-రోలింగ్ స్టీల్ మిల్లు ఇదే కావడం విశేషం.

సమకాలీనం


ఊళ్ళోకి స్వాములోర్లు..!

మనిషి నిత్యాన్వేషి, సత్యాన్వేషి. ఎందరు శాస్త్రవేత్తలను మతగురువులు, రాజులు చిత్రవధలు చేసినా సైన్సే గెలిచింది. అయినా శాస్త్రీయ ఆలోచనలను ప్రజానీకానికి దూరం చేయాలన్న కుతంత్రం ఎప్పటికప్పుడు కొత్తకొత్త రూపాల్లో పుట్టుకొస్తూనే వుంటుంది. 'శాస్త్రీయ దృక్పథాన్ని, వైజ్ఞానిక విషయాలను పెంపొందించి, జనాభివృద్ధి కొరకు ఎల్లవేళలా పాటుపడవలెను' అని భారత రాజ్యాంగంలోని అధికరణ 51-ఎ లో స్పష్టంగా పేర్కొన్నారు. సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ద్వారానే సామాజిక వికాసం సిద్ధిస్తుందని ఉద్బోధించారు. కానీ, దీనికి భిన్నమైన భావజాలం దేశంలో వేళ్ళూనుకొని వుంది. 'సుప్తకంకాళాలు మేలుకొంటున్నాయి/ పెట్టుబడికూటాలు కట్టుకడుతున్నాయి' అంటాడు మహాకవి శ్రీశ్రీ. సాంకేతికంగా ప్రపంచం దూసుకుపోతున్నా, అంతర్జాతీయ, జాతీయ రంగాల్లో ఎన్నో మార్పులు సంభవించినా...ఎన్నడో చచ్చిన చచ్చుపీనిగలు సమాధుల్లోంచి మేల్కొంటూ సనాతన ధర్మం, అంధ మత విశ్వాసం పేరిట కాలం చెల్లిన వైదిక వ్యవస్థను కాయకల్ప చికిత్సతో పునరుజ్జీవింప చేసే ప్రయత్నం తీవ్రంగా జరుగుతోంది. ఆకాశమే హద్దుగా వ్యోమగాములు చంద్రమండలంలో కాలు మోపుతున్నారు. చందమామను హత్తుకొని వస్తున్నారు. అక్కడి మట్టినీ తెస్తున్నారు. అయినా...బాబాలు, స్వాములోర్ల పాదధూళి కోసం లక్షల సంఖ్యలో ప్రజలు బారులు తీరడం వైపరీత్యం!

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలని రాజ్యాంగం చెపుతుంటే, పాలకులు మతమౌఢ్యాన్ని పెంచి పోషిస్తున్నారు. ఇటీవల ఈ మూఢత్వం మరింత పరాకాష్టకు చేరింది. సాక్షాత్తూ దేశ ప్రధానే నేను దేవదూతనని ప్రచారం చేసుకుంటే, అదే మార్గంలో బాబాలు, సాములోర్లు పుంఖానుపుంఖాలుగా తయారవుతున్నారు. దేవుళ్లకు ప్రతినిధులమని చెప్పుకుంటున్నారు. కొత్తకొత్త దీక్షలు, సత్సంగ్‌లు, మిరకిల్ నైట్లు, ఆచారాలు వచ్చేస్తున్నాయి. తాజాగా హత్రాస్‌లో సత్సంగ్ పేరిట జరిగిన ఓ కార్యక్రమంలో 120మంది చనిపోయిన విషయం తెలిసిందే. స్వయం ప్రకటిత దేవుడి పాదధూళి కోసం జరిగిన తొక్కిసలాట మారణహోమంగా మారింది. 'పూర్వాశ్రమంలో మందిని ముంచే లాయరుగా శ్రీవారు/ పార్టీల నెత్తిన శుబ్బరంగా చేతులు బెట్టి లకారా లార్జించారు/ ఒంట్లోని శక్తంతా వుడిగిపోయిం తర్వాత/ ఊకదంపుడు ఉపన్యాసాలు దంచేందుకు/ సన్యాసాశ్రమం స్వీకరించారు' అంటారు సివి ఇలాంటి బాబాల నుద్దేశించే. కరువు కాటకాల వల్ల పశువులకి మేత, మనుషులకి తిండీ లేక గ్రామసీమల్లోని ప్రజలు అల్లాడిపోతున్నారు. నిరుద్యోగం, ఆకలి, పేదరికంలో మన స్థానం అట్టడుగునే. చివరికి తాగే నీళ్ళు కూడా మైళ్లకొద్దీ దూరం నుంచి తెచ్చుకునే దౌర్భాగ్యం మనది. అదే సమయంలో, ఈ సాములోర్లు, బాబాలు, పీఠాధిపతులు అంటూ అడ్డమైన వేషాలు వేసుకుని ప్రజల మత విశ్వాసాన్ని ఆసరాగా తీసుకుని, చోరులు, దోపిడీగాళ్లను శిష్యులుగా చేసుకొని తమ జోలె నింపుకుంటున్నారు. ఇలాంటివారి నుద్దేశించే- 'అల్ల బోడితలలు తెల్లని గొంగళ్ళు/ ఒడల భూతి పూసి యుందురెపుడు/ ఇట్టి వేషము లిల పొట్టకూటికెగాని' అంటాడు వేమన.

'ప్రజల ప్రధాన జీవిత సమస్యలను పక్కదారి పట్టించి/ అన్నం అడిగిన జనాన్ని పిట్టల్లా పేల్చేస్తో/ దేశాన్ని కసాయిశాలగా మార్చేస్తోన్న/ పాలకవర్గం స్వీయ ప్రయోజనాల కోసం/ మతం నాగుకు పాలుపోసి పెంచుతోంది' అంటాడు సివి. ఈ మధ్య కాలంలో టూరిజం పేరుతో మత/ప్రార్థనా స్థలాలను సందర్శిస్తున్నవారు 50 శాతం కాగా, విశ్రాంతి స్థలాలకు వెళ్లే టూర్లు కేవలం 28 శాతమేనని ఒక అధ్యయనంలో తేలింది. మనిషిలోని మూఢత్వాన్ని, మత విశ్వాసాలను సొమ్ము చేసుకునే డేరాబాబాలు, భోలేబాబాలు, స్వాములోర్లు ప్రతి ఊళ్లోనూ, నగరంలోనూ కొత్త రూపాల్లో దర్శనమిస్తూనే వుంటారు. మన రాజ్యాంగం ఇచ్చిన స్ఫూర్తితో ప్రభుత్వాలు, అభ్యుదయవాదులు సమాజాన్ని చైతన్యవంతం చేయాలి. ఇంట్లో తల్లిదండ్రులు, ప్రాథమిక స్థాయి నుంచి ఉపాధ్యాయులూ పిల్లలకు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చాలి. ప్రశ్నించేతత్వాన్ని పెంచాలి. మౌఢ్యాన్ని పెంచి, విద్వేషాలు సృష్టించే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలి.

మంచి మాట




ప్రపంచం మారాలని
మనం కోరుకోవడం కాదు.
మార్పు మనతో మొదలైతే
ప్రపంచం అదే మారుతుంది.
- లియో టాల్‌స్టాయ్,
ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ రచయిత.

Leo Tolstoy

పార్లమెంటులో కుంభస్థలం కొట్టిన 'ఇండియా'

ప్రస్తుతం





తెలకపల్లి రవి

నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాని అయ్యారనీ, ఏది ఏమైనా చివరకు బిజెపి మాటకు తిరుగులేదనీ వాదించేవారికి పార్లమెంటు తొలి సమావేశాలే పెద్ద సమాధానమిచ్చాయి. మారిన బలాబలాల పొందికతో లౌకిక ప్రజాస్వామిక శక్తులు నిలదొక్కుకుంటున్న తీరుకు అద్దం పట్టాయి. ఇప్పటికీ మతతత్వ నిరంకుశ రాజకీయాల సవాలు తొలగిపోయిందని కాదు గాని ప్రతిఘటించే ప్రతిపక్ష శక్తులు కూడా ప్రభావశీలంగా అవతరించాయనే వాస్తవం అందరూ అంగీకరించక తప్పలేదు. గతంలో కేవలం అవహేళనలకు గురవుతూ వచ్చిన కాంగ్రెస్ నాయకుడు ప్రస్తుత ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తనదైన శైలిలో చేసిన ప్రసంగంపై చర్చ ఇందుకు సంకేతమైంది. ఆ ప్రసంగంలో ఇతర అంశాలు అలా వుంచి హిందూత్వకు మోడీత్వను జోడు చేసి బిజెపి సాగిస్తున్న మాయ నాటకం బదాబదలైంది. మొదటి సమావేశాలలో మొదటి ప్రసంగంలోనే నేరుగా ఈ మత రాజకీయాలపై చర్చ మొదలవుతుందని రాజకీయ పరిశీలకులు కూడా ఊహించలేదని చెప్పాలి. ప్రజల తీర్పులోనే అంతర్లీనంగా మత రాజకీయాలు అసహనాలపై విముఖత స్పష్టమైంది గనక రాహుల్ వాటిని ప్రస్తావించడంపై రభస చేయాలనుకున్న బిజెపి ఎత్తుగడలు కూడా ఫలించలేదు. కొన్ని పార్టీలు తమ అవసరాల కోసం బిజెపితో చేతులు కలిపినా రకరకాల కారణాలతో బడా మీడియా మోడీకే జై కొట్టినా ఈ రాజకీయాల వల్ల ముప్పును ప్రజలు అర్థం చేసుకున్నారు గనకే ఎన్నికలలో మెజార్టి నిరాకరించారు. ఆ కారణంగానే సభలో వచ్చిన విమర్శలను మత కోణంలోకి మళ్లించే దుస్సాహసం బిజెపి చేయలేకపోయింది. కొంతమంది నాయకులు వరుసగా ట్వీట్లు పెట్టి ఆ ప్రయత్నం చేసినా ఫలితం రాలేదు. దాంతో బడా మీడియా కూడా వెనక్కు తగ్గింది. లేకపోతే ఈ దేశంలో మరో విధమైన చర్చ జరిగి వుండేదనడంలో సందేహం లేదు. కీలక రాజకీయ కథనం (నేరేటివ్) మారిందనడానికి ఇదే నిదర్శనం, అయితే అదే సమయంలో మత భావాలను రెచ్చగొట్టే శక్తులను తక్కువ అంచనా వేయడం కూడా పొరబాటవుతుంది. ఎందుకంటే తర్కంతో సత్యంతో నిమిత్తం లేని మోసపూరిత రాజకీయం వారిది. ఇలా అన్నారట, అలా చేశారట, ఇదే జరిగిందట ఇలాంటి ప్రచారాలను తప్పుడు పద్ధతిలో ముందుకు తెచ్చి దావానలంలా వ్యాప్తి చేసే ముప్పు ఎప్పుడూ పొంచి వుంటుంది. పార్లమెంటు సాక్షిగా ప్రధాని మోడీ చేసిన విఫల యత్నం అదే. రాజ్యసభ చైర్మన్ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ మరింత బాహాటంగా ఆ పని చేయడం కూడా గమనించవచ్చు. దక్షిణ భారతంలో బిజెపికి అంత బలం లేదు గనక మతతత్వ రాజకీయాలను ఎదుర్కొనడం పెద్ద సవాలు కాదన్నట్టు కొందరు మాట్లాడుతుంటారు. కాని ఒకప్పుడు ఉత్తరాదిన కాంగ్రెస్ బలహీనపడినప్పుడు దక్షిణాది సీట్లు ఆదుకున్నట్టే ఇప్పుడు బిజెపికి కూడా ఈ సీట్లతోనే అధికారం నిలబెట్టుకోగలిగిందని గుర్తు చేసుకుంటే ఇక్కడా ఆ సవాలు తీవ్రంగానే వుందని తెలుస్తుంది. కనుకనే సభ లోపలా వెలుపలా ఉత్తర దక్షిణాలతో నిమిత్తం లేకుండా మత రాజకీయాలను అందులోనూ హిందూత్వ పేరుతో దేశంలోని మెజారిటీ మతానుయాయులను పక్కదోవ పట్టించే కుటిల రాజకీయాలను నిశితంగా ఎదుర్కోవడం నిరంతర కర్తవ్యంగానే వుంటుంది. పార్లమెంటులో జరిగింది అదే. హిందూత్వ హిందూ మతం ఒకటి కాదనేది ఈ చర్చలో కీలక సారాంశం.

> కొన్ని పార్టీలు తమ అవసరాల కోసం బిజెపితో చేతులు కలిపినా రకరకాల కారణాలతో బడా మీడియా మోడీకే జై కొట్టినా ఈ రాజకీయాల వల్ల ముప్పును ప్రజలు అర్థం చేసుకున్నారు గనకే ఎన్నికలలో మెజార్టి నిరాకరించారు. ఆ కారణంగానే సభలో వచ్చిన విమర్శలను మత కోణంలోకి మళ్లించే దుస్సాహసం బిజెపి చేయలేక పోయింది. కొంతమంది నాయకులు వరుసగా ట్వీట్లు పెట్టి ఆ ప్రయత్నం చేసినా ఫలితం రాలేదు. దాంతో బడా మీడియా కూడా వెనక్కు తగ్గింది. లేకపోతే ఈ దేశంలో మరో విధమైన చర్చ జరిగి వుండేదనడంలో సందేహం లేదు. కీలక రాజకీయ కథనం (నేరేటివ్) మారిందనడానికి ఇదే నిదర్శనం, అయితే అదే సమయంలో మత భావాలను రెచ్చగొట్టే శక్తులను తక్కువ అంచనా వేయడం కూడా పొరబాటవుతుంది. ఎందుకంటే తర్కంతో సత్యంతో నిమిత్తం లేని మోసపూరిత రాజకీయం వారిది. ఇలా అన్నారట, అలా చేశారట, ఇదే జరిగిందట ఇలాంటి ప్రచారాలను తప్పుడు పద్ధతిలో ముందుకు తెచ్చి దావానలంలా వ్యాప్తి చేసే ముప్పు ఎప్పుడూ పొంచి వుంటుంది. పార్లమెంటు సాక్షిగా ప్రధాని మోడీ చేసిన విఫల యత్నం అదే.

రెండూ ఒకటి కాదు

మతాల పుట్టుక పరిణామం చర్చ సుదీర్ఘమైంది. ఇక్కడ రాజకీయ కోణం మాత్రం చూద్దాం. హిందూ మతం ప్రాథమికంగా అహింసకూ సత్యానికి ప్రతీక అనేది రాహుల్ గాంధీ లేవనెత్తిన వాదన, మీరు ప్రచారం చేసే ద్వేషం అసహనం హిందూ మత స్వభావానికే విరుద్ధమని చెప్పడానికి ప్రయత్నించారు. తమను తాము హిందువులుగా చెప్పుకునేవారు ద్వేషం పెంచుతున్నారు అని ఆయన అన్నది బిజెపిని ఆరెస్సెస్ గురించి అని అందరికీ తెలుసు. అన్ని మతాలు కూడా అహింస వద్దనే చెబుతాయంటూ ఆయన సిక్కు, ఇస్లాం, క్రైస్తవ మతాలను ప్రస్తావించారు. ఈశ్వరుడు త్రిశూలం ధరించడం గాక వెనక భాగంలో వుంటుందని చెప్పారు. ఇందుకోసం ఒక చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ విధంగా చిత్రాలు ప్లకార్డులు సభలో చూపడం నిబంధనలకు విరుద్ధమని స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం పెట్టారు. దాంతో రాహుల్ గాంధీ శివుడి చిత్రం చూపకూడదా? అని ఎదురు ప్రశ్న వేయడంతో స్పీకర్ ఇరకాటంలో పడిపోయారు. చూపకూడదు అని చెబితే బిజెపి రాజకీయాలకు కష్టం. అదొక్కటి చూపి ఇతర మతాలవి చూపకూడదని చెప్పడం కుదరదు. ఈ చిక్కుముడి నుంచి బయట పడటానికే మోడీ దేశంలో వున్న కోట్లాది మంది హిందువులను అవమానించారనే పల్లవితో సభను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో బిజెపి సభ్యులు తప్ప ఇతరులు గొంతు కలిపే అవకాశం లేనట్టే కనిపించింది. సభలో ఎన్‌డిఎతో ఇంచుమించు ఢీ కొట్టగల బలం సంపాదించుకున్న 'ఇండియా' వేదిక సభ్యులు కూడా వెనక్కు తగ్గకుండా తలపడ్డారు. ప్రతిపక్షం పీక నొక్కేసి ఇష్టానుసారం సభలో విద్వేష ప్రసంగాలు సాగించిన గత పరిస్థితికి పూర్తి భిన్నమైన పరిస్థితి కనిపించింది. బిజెపి అరెస్సెస్‌లను రాజకీయంగా విమర్శిస్తే మొత్తం హిందూ సమాజాన్ని అన్నట్టుకాదనేది మొదటి రోజునే గట్టిగా చర్చజరగడం విశేషం. ఆ తప్పు వాదనే ఆరెస్సెస్ సంఘ పరివార్ ఆయువు పట్టు. ఇతర మతాల్లా హిందూ మతం మిలిటెంటు మతం కాదనేది వారి ఫిర్యాదు. ఆ విధంగానే గోల్వాల్కర్, సావర్కర్ వంటి వారు హిందూత్వ సిద్ధాంతాన్ని తీసుకొచ్చారు. సావర్కర్ ప్రయోగించిన హిందూత్వనూ నేరుగా బిజెపి నెత్తికి ఎత్తుకుంది. వివేకానందుడు, అరవిందుడు వంటి వారెవరూ ఈ పదాన్ని గానీ ఈ వాదనలను గాని సమర్థించిన దాఖలాలు లేవు. మోడీ నాయకత్వంలో మొదట గుజరాత్ మారణకాండ తర్వాత వరుస విజయాలు సాధించిన బిజెపి కార్పొరేట్ మద్దతుతో ఆయనను ప్రధానిని చేసింది గనక హిందూత్వ ఆరెస్సెస్ తెరచాటు నుంచి సూటిగా బయటకొచ్చి దిశానిర్దేశం మొదలుపెట్టింది. వైసిపి, టిడిపి, బిఆర్‌ఎస్ వంటి పార్టీల నాయకులు కొన్నిసార్లు దిగ్విజయ్ సింగ్ వంటి కాంగ్రెస్ నేతలు కూడా హిందూత్వ అనే మాటను రాజకీయ ప్రయోగంగా వాడటం చూశాం. బడా మీడియా కూడా దానికి కారణమైంది. ఇప్పుడా వైరుధ్యం ప్రహసనం పార్లమెంటు సాక్షిగా బద్దలు కావడం స్వాగతించదగిన పరిణామం, కనీసం విద్యాధికులు తమను తాము లౌకిక వాదులుగా పరిగణించుకునేవారెవరైనా దీన్ని హర్షిస్తారని ఆశించాలి. కాని రాజ్యసభలో ఇందుకు పూర్తి భిన్నమైన మాటలు విన్నాం. స్పీకర్ బిర్లాకు వున్న పాటి సంకోచం లేకుండా చైర్మన్ జగదీప్ ధన్‌కర్ వ్యవహరించడమే ఇందుకు కారణం. రాజ్యాంగ సైద్ధాంతిక కోణాలలో చూస్తే రాజ్యసభలో సంఘర్షణ తీవ్రత మీడియాలో అంతగా ప్రతిబింబించలేదంటే చైర్మన్ వైఖరి ఒక కారణం. అసలే స్వంత బలం లేని ఆ సభలో పరిస్థితిని ప్రచారంలోకి రానివ్వకూడదనే బిజెపి వ్యూహం రెండవ కారణం. మతతత్వం నిరంకుశత్వం కార్పొరేట్ ప్రయోజనాలను కలబోసిన బిజెపి పై విమర్శలకు రాజకీయ సమాధానం ఇవ్వకుండా కాంగ్రెస్ పైన, గాంధీ కుటుంబం పైన దాడితో సరిపెట్టడం ఆ వ్యూహంలో భాగమే. రాహుల్‌వి పిల్ల చేష్టలంటూ తీసిపారేసేందుకు మోడీ చేసిన ప్రయత్నం అలాంటిదే. గతంలో వలె అది పని చేయకపోవడమే ఈ సారి ప్రత్యేకత. అసలు రాహుల్ గాంధీ మాట్లాడుతుంటే అడ్డుకోవడానికి మోడీ లేవాల్సి రావడమే వింత. మోడీ జీవ పదార్థం కాదు, పరమాత్మ నేరుగా మోడీ ఆత్మతో మాట్లాడతారని ఎద్దేవా చేసే పరిస్థితి వస్తుందని గతంలో ఎవరూ అనుకోలేదు. ఇదేదో మోడీ, రాహుల్ వ్యక్తిగత స్పర్థ అన్నట్టు చిత్రించే రాతలు కూడా కొన్ని మీడియాలో వచ్చాయి. కాని అవేవీ కూడా నిలబడలేదు. సభలో వామపక్ష సభ్యులు, సమాజ్‌వాది, తృణమూల్ పార్టీల ఎంపీలు కూడా బిజెపిని గట్టిగా నిలవరించగలిగారు.

ఏకలవ్య చైర్మన్ విపరీతాలు

రాజ్యసభ లోనూ మణిపూర్ మంటలు, నీట్ కుంభకోణం వంటి అంశాలపై చర్చ కోరిన ప్రతిపక్షానికి అవకాశం నిరాకరించడమే గాక పూర్తి స్థాయిలో మోడీ కీర్తనకు చైర్మన్ సిద్ధమయ్యారు. మొదట చర్చను ప్రారంభించిన ఖర్గే నీట్ కల్లోలంపై మాట్లాడుతూ అన్ని వ్యవస్థలను ఒక సంస్థ గుప్పిట్లో పెట్టుకున్నదని, ఆరెస్సెస్, బిజెపి కలిసి వాటిని నాశనం చేశాయని విమర్శించినపుడు కూడా చైర్మన్ రంగంలోకి దిగారు. ఏదైనా ఒక సంస్థలో వుండటం నేరమా? ఆరెస్సెస్ దేశం కోసం పని చేసే సంస్థ. దానికి అంతర్జాతీయంగా ప్రతిష్ట వుంది అని కీర్తించడంతో సభలో నిరసనలు మార్మోగాయి. సభా నాయకుడుగా నూతనంగా నియమితుడైన జె.పి. నడ్డా మాట్లాడుతుంటే చైర్మన్ ధన్‌కర్ తన భక్తిని ఆపుకోలేక మధ్యలో జోక్యం చేసుకున్నారు. నడ్డాజీ మీకన్నా పాతికేళ్ల ముందు నుంచి నేను ఆరెస్సెస్ ఏకలవ్య శిష్యుడిగా వున్నానని ప్రకటించారు. కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చాక తాను ఆ వైపు వెళ్లానని అప్పటి వరకూ ఆలస్యం జరిగినందుకు విచారించానని చెప్పుకున్నారు. వ్యక్తిగతంగా జగదీప్ ధన్‌కర్ ఆరెస్సెస్ భక్తుడవడం వేరే విషయం. కానీ రాజ్యాంగ పదవిలో వుండి ఒక సంస్థపై అంతగా పక్షపాతం ప్రకటించడం, విమర్శలు చేయొద్దని ప్రతిపక్షాన్ని అడ్డుకోవడం మాత్రం ఆ స్థానానికీ సభకూ తగని పని. మీరు ఆరెస్సెస్ భజన మానుకోవాలని ఖర్గే వ్యాఖ్యానించారు. చివరగా మోడీ సమాధానం సమయంలో నిరసన తెల్పుతూ వాకౌట్ చేసిన ప్రతిపక్షంపై ఆయన అధికార పార్టీ భాషలో విరుచుకు పడ్డారు. ప్రతిపక్షాల వాకౌట్ తనను మోడీని మాత్రమే గాక రాజ్యాంగాన్ని అవమానించిందన్నారు! ఇంతకన్నా రాజ్యాంగానికి అవమానం వుండదంటూ వాకౌట్‌ను తీవ్ర భాషలో ఖండించారు. రాజ్యాంగం అంటే ఏదో చేతుల్లో పట్టుకునేది కాదు, జీవన విధానం అంటూ ఉక్రోషం వెలిబుచ్చారు. మొత్తంపైన అటు లోక్‌సభలో మత విద్వేషాలపై చర్చ. ఇటు రాజ్యసభలో రాజ్యాంగ విలువలు, ఆరెస్సెస్ పాత్రపై చర్చ ప్రజలిచ్చిన తీర్పునకు సరైన కొనసాగింపు అనే చెప్పాలి. ప్రాంతీయ పాక్షిక రాజకీయాల్లోనే తల మునకలవుతూ దేశానికి ప్రజాస్వామ్యానికి సంబంధించిన విశాల అంశాలను విస్మరిస్తున్న నాయకులు, పార్టీలూ కళ్లు తెరవాలి. ●

సెటైర్

పిల్ల చేష్టలు

ఉషాకిరణ్

> "అవును...ఆటలంటే, ఛాంపియన్లంటే ప్రధానికి ఎంతో ప్రేమ! ప్రధానిది ఎంతో బాధ్యతగల సున్నిత హృదయం! మోడీ ప్రధాని కావటం ఈ దేశ ప్రజలు చేసుకున్న ఏడేడు, పద్నాలుగు జన్మల పుణ్యం" అన్నాడు శేఖర్ తన్మయంగా.
> "అవునా! మరి తమపై బ్రిజ్ భూషణ్ వేధింపులకు పాల్పడుతున్నాడని మహిళా రెజ్లర్లు ఢిల్లీ వీధుల్లో నిరసనలు చేస్తే మోడీ స్పందించలేదేం! ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ వెక్కి వెక్కి ఏడుస్తూ, నేను రెజ్లింగ్ నుంచి తప్పకుంటున్నానని ప్రకటిస్తే మోడీజీ ఒక్క పది నిమిషాలు కేటాయించి ఆమెతో మాట్లాడలేదేం! ఆమె భారతీయ క్రీడాకారిణి కాదా!" అడిగింది లక్ష్మి.
> గాల్లో తేలిపోతున్న శేఖర్ ఒక్కసారిగా నేల మీదికి దిగిపోయాడు.

శేఖర్ ఆనందంతో గాలిలో తేలిపోతున్నాడు. హడావుడిగా బయటకెళ్లి కిలో స్వీటు తెచ్చాడు. ఇంటి చుట్టూ కనపడ్డ వారికి పంచాడు! ఇంట్లోకి వచ్చినా సంతోషంతో కాలు నిలవటం లేదు! అటూ ఇటూ తిరుగుతూ, ఇంట్లోని వస్తువులన్నీ అట్నుంచి, ఇటూ, ఇట్నుంచి అటూ కదిలిస్తున్నాడు.

"శ్రీవారూ...మీ ఆనందాన్ని కొంచెం అదుపులో పెట్టుకోండి. మీరు ఇలా సామాన్ల ప్లేసులు మార్చకండి! తర్వాత ఏవి ఎక్కడ న్నాయో నేను వెదుక్కోవాల్సి వస్తుంది!" అన్నది లక్ష్మి నవ్వుతూ.

"ఇండియా కప్పు కొట్టినప్పటి నుండి నాన్న పిచ్చ హ్యాపీగా ఉన్నాడమ్మా!" అన్నాడు బంటి ఎగిరి గంతులు వేస్తూ.

"ఇండియా! అంటావేంట్రా! భారత్ అనాలి" అన్నాడు శేఖర్.

"రెండూ ఒకటే కదా!" అన్నాడు బంటి మళ్ళీ గంతులు వేస్తూ.

"రెండూ ఒకటే కాదు! మన దేశం భారత్! నీకు ఎంత చెప్పినా తెలియటం లేదు! పిల్ల వెధవా! అన్నీ పిల్ల చేష్టలే!" అన్నాడు శేఖర్ చిరాకుగా.

"పిల్ల చేష్టలు చూసి పెద్దవాళ్ళు ఆనందించాలి! కాని చిరాకు పడతారేం!" అన్నది లక్ష్మి.

"నీకు తెలియదు లక్ష్మి! పిల్లచేష్టలు దేశానికి చాలా ప్రమాదం!" అన్నాడు శేఖర్ గంభీరంగా.

"సర్లెండి! ఇండియా అదే భారత్ ఫైనల్లో గెలిచిన రోజు కన్నా ఈ రోజే ఎక్కువ ఆనందంగా కనబడుతున్నారు! ఏమిటీ విశేషం!" కుతూహలంగా అడిగింది లక్ష్మి.

"అదీ అలా అడుగు! భారత జట్టును ప్రధాని మోడీ ఎంతో ప్రత్యేకంగా అభినందించారు! నీకు తెలుసా? ఎంతో విలువైన తన సమయాన్ని రెండు గంటల పాటు క్రికెట్ ప్రపంచ ఛాంపియన్లతో గడిపారు!..." అంటూ ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు శేఖర్.

"సర్లెండి! రెండు గంటల పాటు క్రికెటర్లతో ప్రధాని ఏం చేశారండి!" ఉత్సుకతతో అడిగింది లక్ష్మి.

"క్రికెటర్లు ప్రపంచకప్ ఎలా సాధించారో ఒక్కొక్కరినీ ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు! ప్రతి ఒక్కరి ఫీలింగ్స్ అడిగి తెలుసుకున్నారు! ఫైనల్లో గెలవటానికి ఏమి ప్రణాళికలు వేశావని రోహిత్‌నూ, టోర్నమెంటులో అన్ని మ్యాచుల్లో సరిగ్గా ఆడనందున, ఫైనల్‌కి ఎలా ప్రిపేర్ అయ్యావని విరాట్‌ను ప్రత్యేకంగా అడిగారు తెలుసా!" అన్నాడు గర్వంగా శేఖర్.

"కవర్ డ్రైవ్ అంత బాగా ఎలా ఆడతావని విరాట్‌ను మోడీ అడిగారా నాన్నా!" అన్నాడు బంటిగాడు.

"నువ్వు ఆగురా! అన్నీ పిల్ల చేష్టలే! రెండు గంటల్లో ప్రధాని ఇంకా ఏం చేశారండీ" అడిగింది లక్ష్మి.

"ప్రపంచ ఛాంపియన్లతో కలిసి ఫోటోలు దిగారు! ఇక్కడో విషయం గుర్తించాలి! మోడీ స్వయంగా ప్రపంచకప్పును పట్టుకోలేదు! రోహిత్ ద్రావిడ్ చేతుల్లో కప్పును ఉంచి, వారిద్దరి చేతులను మోడీ పట్టుకున్నారు! వారే ప్రపంచ కప్పును సాధించారని, తాను నిమిత్తమాత్రుడనేనన్న సందేశం ఉంది!" అన్నాడు శేఖర్ గంభీరంగా.


"ఆటలంటే ప్రధానికి ఎంత ప్రేమ?" అన్నది లక్ష్మి

"అవును...ఆటలంటే, ఛాంపియన్లంటే ప్రధానికి ఎంతో ప్రేమ! ప్రధానిది ఎంతో బాధ్యత గల సున్నిత హృదయం! మోడీ ప్రధాని కావటం ఈ దేశ ప్రజలు చేసుకున్న ఏడేడు, పద్నాలుగు జన్మల పుణ్యం" అన్నాడు శేఖర్ తన్మయంగా.

"అవునా! మరి తమపై బ్రిజ్ భూషణ్ వేధింపులకు పాల్పడుతున్నాడని మహిళా రెజ్లర్లు ఢిల్లీ వీధుల్లో నిరసనలు చేస్తే మోడీ స్పందించలేదేం! ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ వెక్కి వెక్కి ఏడుస్తూ, నేను రెజ్లింగ్ నుంచి తప్పుకుంటున్నానని ప్రకటిస్తే మోడీజీ ఒక్క పది నిమిషాలు కేటాయించి ఆమెతో మాట్లాడలేదేం! ఆమె భారతీయ క్రీడాకారిణి కాదా!" అడిగింది లక్ష్మి.

గాల్లో తేలిపోతున్న శేఖర్ ఒక్కసారిగా నేల మీదికి దిగిపోయాడు.

లక్ష్మి ఇదంతా గమనిస్తూనే..."టోర్నమెంటు ఆసాంతం విఫలమైనపుడు, ఫైనల్‌లో నీ మానసిక స్థితి ఏమిటని విరాట్‌ను, మీడియా ముందు అడిగిన మోడీజీ...మహిళా రెజ్లర్లను ఒక ఎంపీ వేధిస్తే,



కనీసం నాలుగు గోడల మధ్యనైనా...మీ మానసిక స్థితి ఏమిటి అని అడిగారా? భారత దేశానికి బంగారు పతకాలు తెచ్చిన బంగారు తల్లులూ...మీకు ప్రధానిగా నేను అండగా ఉన్నాను. కుంగిపోకండమ్మా...అని నాలుగు మాటలు చెప్పలేదేం!" అడిగింది.

శేఖర్ మాట్లాడలేదు.

"పదకొండు మంది క్రికెట్ ఆటగాళ్ళ కోసం... రెండు గంటల పాటు తన విలువైన సమయాన్ని కేటాయించిన ప్రధానికి, మణిపూర్‌లో వందలాది మందిని హత్య చేస్తుంటే, మహిళలను నగ్నంగా ఊరేగిస్తుంటే...మీకు నేనున్నానని, ధైర్యం చెప్పేందుకు, మణిపూర్‌ను సందర్శించే సమయం దొరకటం లేదే...!" అడిగింది లక్ష్మి.

"ప్రపంచ ఛాంపియన్లను అవమానిస్తున్నావ్!" అన్నాడు శేఖర్ ఆగ్రహంగా.

"దీనికేం తక్కువ లేదు! రెండు సంవత్సరాలుగా మణిపూర్ దగ్ధమై పోతుంటే, ఆ రాష్ట్రం పాకిస్తాన్‌లో ఉన్నట్లు వ్యవహరిస్తున్న మీరు...ఆ రాష్ట్ర ప్రజలను అవమానిస్తున్నారా లేక దేశంలో నుంచి బహిష్కరించారా?" నిలదీసింది లక్ష్మి.

"అదిసరే...మరి ప్రపంచ ఛాంపియన్లను అభినందిచొద్దా?"అన్నాడు శేఖర్ గొంతు పెగల్చుకుని.

"తప్పకుండా అభినందించాలి! ఏ ఆటలోనైనా ప్రపంచ ఛాంపియన్ అంటే అత్యున్నతం! దాంట్లో ఎవరూ తప్పు పట్టరు!

కాని మహిళా రెజర్లను అవమానించిన వాడికి మీ టికెట్ ఇస్తారు! మహిళా రెజర్లు నిరసన తెలుపుతుంటే పోలీసులతో కొట్టిస్తారు! అత్యున్నతమైన ఒలింపిక్ పతకాలను రోడ్డుపైన వదిలేసి, కన్నీళ్ళతో కదిలిపోతుంటే, వారిని పలకరించే తీరిక ప్రధానికి లేదు! దేశంలో క్రికెట్ ఒక్కటేనా ఆట?" మళ్ళీ నిలదీసింది లక్ష్మి.

శేఖర్ ఏదో చెప్పబోయాడు.

"ఒక పక్క ప్రపంచ ఛాంపియన్లతో మోడీ ఫోటోలు దిగుతుంటే మరో పక్క భోలే బాబా పాదధూళి కోసం వందకు పైగా పిల్లలు, మహిళలు తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయారు! దీనిపై ప్రధాని ఈ రోజు వరకు స్పందించలేదేం! పోనీ వారేమైనా పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్ నుంచి వచ్చారా? రోహింగ్యాలా? అచ్చమైన హిందువులే కదా! వారి పట్ల ప్రధానికి బాధ్యత లేదా?" ప్రశ్నించింది లక్ష్మి.

"ఈవెంట్ ఆర్గనైజర్ల మీద ఎఫ్ఐఆర్ బుక్ చేయించారు కదా!" ధైర్యంగా అన్నాడు శేఖర్.

"ఇదుగో ఇదే పిల్ల చేష్టలు! పిల్లలకు బాధ్యత తెలియదు! కాబట్టి వారేదో మాట్లాడుకుంటారు! కాని మీకు బాధ్యత ఉంది! గత పదేళ్లుగా అధికారంలో ఉన్నారు! కాని ఈ దేశంలో ప్రతి సమస్యకి 60 ఏళ్ళ కింద చనిపోయిన నెహ్రూ, 40 ఏళ్ళ కింద చనిపోయిన ఇందిరా గాంధీలదే బాధ్యత అంటారు! గత పదేళ్ళలో మీరు ఏం వెలగబెట్టారో చెప్పకుండా, హోంవర్క్ ఎందుకు చేయలేదంటే, నా పెన్సిల్‌ని ఎవడో కొట్టేశాడని స్కూలు పిల్లలు చెప్పినట్లుంది! అందుకే మీరు పిల్ల చేష్టలు మాని బాధ్యతతో మెలగండి' అన్నది లక్ష్మి. ●

జనవాక్యం

గందరగోళంగా పరీక్షా విధానం


రాష్ట్రంలో 1000 ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో ప్రస్తుతం అమలవుతున్న సిబిఎస్‌ఇ, ఈ విద్యా సంవత్సరంలో (2025) అమలు చేయబోయే పదవ తరగతి సిబిఎస్‌ఇ పబ్లిక్ పరీక్షలు, పరీక్షా విధానంపై, పరీక్షల అసెస్మెంట్, ఇంటర్నల్ అసెస్మెంట్, మూల్యాంకన విధానంపై ప్రభుత్వం సమీక్ష చేయాలి. సిబిఎస్‌సి పాఠశాలల్లో ఒకే పాఠశాలలో కొన్ని తరగతులకు స్టేట్ అకడమిక్ క్యాలెండర్, మరికొన్ని తరగతులకు సిబిఎస్‌ఇ క్యాలెండర్ అమలు చేయాలంటే కష్టతరం. సిలబస్ అందరికీ ఒకటే అయినప్పటికీ రాష్ట్రంలో ఉన్న విద్యార్థులకు ఒక పరీక్ష విధానం, సిబిఎస్‌ఇ గుర్తింపు ఉన్న పాఠశాలకు మరొక పరీక్ష విధానం సరైన నిర్ణయం కాదు. మరోవైపు ఇంటర్ బోర్డ్‌తో జూనియర్ ఇంటర్ తరగతులు ఉన్న సిబిఎస్‌ఇ పాఠశాలలైతే, ఒకే పాఠశాలలో మూడు వివిధ రకాలైన అకాడమిక్ క్యాలెండర్‌లు నడిపించాలి. ఇంతటి గందరగోళాన్ని సృష్టిస్తున్న ఈ అంశంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు రాష్ట్రంలో ఉన్న 1000 సిబిఎస్‌ఇ పాఠశాలలో జరిగే పరీక్ష విధానంపై, ఇంటర్నల్ అసెస్మెంట్‌పై స్పష్టతనివ్వాలి. ఈ గందరగోళానికి తెర వేయాలి.

- బి. తిలక్,
ఆదిత్య నగర్, శ్రీకాకుళం జిల్లా.

భారత్‌లో పెరుగుతున్న అసమానతలు

- ప్రాంతీయంగా, సామాజికంగా ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు
- పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య పెరుగుతున్న అంతరం
- 'యాక్సెస్ (ఇన్) ఈక్వాలిటీ ఇండెక్స్' నివేదిక





న్యూఢిల్లీ : మోడీ పాలనలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయి. ప్రాథమిక సౌకర్యాలు, సామాజిక భద్రత వంటి పలు అంశాల్లో ఈ తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని నిపుణులు, మేధావులు అంటున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య పెరుగుతున్న ఈ విభజనలను తగ్గించడానికి ప్రాంతీయ అసమతుల్యతలను పరిష్కరించడం, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, సామాజిక భద్రతను బలోపేతం చేయడం, విద్యలో పెట్టుబడులు పెట్టడం, భారతీయ సమాజంలోని అన్ని వర్గాలకూ సమాన అవకాశాలను పెంపొందించడం వంటివి చాలా అవసరమని నిపుణులు, మేధావులు సూచిస్తున్నారు. సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్స్ స్టడీస్ (సీఎన్‌ఈఎస్) పరిశోధకులు రూపొందించిన 'యాక్సెస్ (ఇన్) ఈక్వాలిటీ ఇండెక్స్' నివేదిక ఈ అంశాలను వెల్లడించింది. యాక్సెస్ (ఇన్) ఈక్వాలిటీ ఇండెక్స్ అధ్యయనం భౌగోళిక ప్రాంతాలు, సామాజిక సమూహాలు రెండింటిలోనూ భారతదేశాన్ని పీడిస్తున్న అసమానతలపై చర్చిస్తుంది. భారత్‌లో 68 కుటుంబాలు ఉన్న జనాభాలో దాదాపు 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అయితే 32 శాతం కుటుంబాలతో కూడిన జనాభాలో 29.2 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు.

ప్రాథమిక సౌకర్యాలను పరిశీలించినప్పుడు ఈ విభజన ప్రత్యేకంగా కనిపిస్తుంది. జల్ జీవన్ మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, కేవలం 22.5 శాతం గ్రామీణ కుటుంబాలు ఏడాది పొడవునా నీటిని పొందుతున్నాయి. అయితే పట్టణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 58.9 శాతంగా ఉన్నది. పారిశుధ్యం విషయంలోనూ రెండు ప్రాంతాల మధ్య అసమానతలు కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 68.8 శాతంతో పోలిస్తే.. 80 శాతం పట్టణ గృహాలకు మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ, పరిమిత మౌలిక సదుపాయాలు, భౌగోళిక తీరు, పేదరికం వంటి సవాళ్లు గ్రామీణ వర్గాలకు మరుగుదొడ్ల భద్రతను మరింత కష్టతరం చేస్తాయి.

శుభ్రమైన వంట ఇంధనానికి అంతరం విస్తరించింది. దాదాపు అన్ని పట్టణ కుటుంబాలు (92శాతం) శుభ్రమైన వంట ఇంధనాన్ని ఉపయోగించుకుంటాయి. అయితే గ్రామీణ కుటుంబాల్లో సగం (49.8 శాతం) మాత్రమే అలా చేస్తున్నాయి. ఆసక్తికరంగా, మొబైల్ ఫోన్ వినియోగం రెండు ప్రాంతాలలో దాదాపు సమానంగా ఉన్నది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో 93.3 శాతం, పట్టణాల్లో 96.6 శాతంగా ఉన్నది. అయితే, ఇంటర్నెట్ స్వీకరణను చూసినప్పుడు డిజిటల్ విభజన స్పష్టంగా కనిపిస్తున్నది. పట్టణ ప్రాంతాల్లో 64.6 శాతంతో పోలిస్తే గ్రామీణ నివాసితులలో కేవలం 41 శాతం మందికి ఇంటర్నెట్ సదుపాయం ఉన్నది.

సామాజిక గుర్తింపు విషయానికొస్తే.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన 50 శాతం కంటే తక్కువ కుటుంబాలు ఏడాది పొడవునా నల్లా(కుళాయి) నీటిని పొందటానికి స్థిరమైన సౌకర్యాన్ని కలిగి ఉన్నాయి. ముఖ్యంగా, ఎస్టీ జనాభాలో కేవలం 19.5 శాతం మందికి మాత్రమే ఏటా పైపుల ద్వారా నీటికి తగినంత యాక్సెస్ ఉన్నది. హౌసింగ్‌లో.. దాదాపు 50 శాతం కుటుంబాలు క్యాటగిరీతో సంబంధం లేకుండా.. మొదటిసారిగా ఇంటిని కొనుగోలు చేయటం, నిర్మించటం వంటివి చేశాయి. ఈ గణాంకాలు అంతరాలను తగ్గించటానికి, అన్ని సామాజిక సమూహాలకు సమానమైన నీరు, పారిశుధ్యం, గృహాలు అందేలా చేసే అవసరాన్ని నొక్కి చెప్తాయి.

గ్రామీణ తల్లులు (75.4 శాతం మంది)తో పోలిస్తే పట్టణ ప్రాంత తల్లులు (84.6 శాతం మంది) ప్రసవానంతర సంరక్షణను పొందుతున్నారు. ఆరోగ్య బీమా కవరేజ్, బాల్య వ్యాధి నిరోధక టీకాల విషయంలో గ్రామీణ ప్రాంతాలు పట్టణ ప్రాంతాలను అధిగమించాయి. ఆరోగ్య బీమా కవరేజ్ రేటు గ్రామీణ ప్రాంతాల్లో 42.4 శాతం, పట్టణ ప్రాంతాల్లో 38.1 శాతం, బాల్య వ్యాధి నిరోధక టీకాలు గ్రామీణ ప్రాంతాల్లో 57.0 శాతం, పట్టణ ప్రాంతాల్లో 43.1 శాతంగా ఉన్నాయి.

భారత్‌లోని వివిధ సామాజిక సమూహాలలో కార్మికుల జనాభా నిష్పత్తి(డబ్ల్యూపీఆర్), నిరుద్యోగిత రేటు(యూఆర్)పై సమర్పించిన గణాంకాలు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగంలో ఉన్న అసమానతలను నొక్కి చెబుతున్నాయి. ముఖ్యంగా, ఎస్సీలు 51 శాతంతో వద్ద సాపేక్షంగా అధిక డబ్ల్యూపీఆర్‌ను కలిగి ఉన్నారు. ఇది శ్రామికశక్తిలో నిమగ్నమైన గణనీయమైన నిష్పత్తిని సూచిస్తుంది. అయినప్పటికీ 18 శాతం యూఆర్.. నిరంతర నిరుద్యోగ సవాళ్లను సూచిస్తుంది. దీనికి విరుద్ధంగా.. ఎస్టీలు తక్కువ డబ్ల్యూపీఆర్ (41 శాతం), అధిక యూఆర్ (32 శాతం) రెండింటినీ ఎదుర్కొంటారు. ఓబీసీలలో అధిక డబ్ల్యూపీఆర్ (42 శాతం)ని ప్రదర్శిస్తుంది. కానీ ఇప్పటికీ 33 శాతంతో గణనీయమైన యూఆర్‌ను కలిగి ఉన్నది.

జనవరి 2022 నాటికి, మొత్తం పని చేసే పోలీసులలో ఎస్సీలు 15.99 శాతం మంది (జనాభాలో 16 శాతం వాటా), ఎస్టీలు 11.77 శాతం మంది, ఓబీసీలు 30.79 శాతం మంది ఉన్నారు. అయితే, ఈ పరిశోధనలు ప్రభుత్వాలు, అధికారుల నుంచి లక్ష్య విధానాలు, సహకార చర్యల అవసరాన్ని నొక్కి చెబుతున్నాయని మేధావులు, నిపుణులు అంటున్నారు. దురదృష్టవశాత్తు, కేంద్రంలోని మోడీ సర్కారు మాత్రం కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితమవుతూ.. దేశ ప్రయోగనాలను గాలికి వదిలేసిందని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అయోధ్య తరహాలోనే గుజరాత్‌లో బిజెపిని ఓడిస్తాం

- కాంగ్రెస్ నేత రాహుల్



అహ్మదాబాద్ : అయోధ్యలో బిజెపిని ఓడించినట్టే గుజరాత్‌లోనూ ఆ పార్టీని ఓడించితీరుతామని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ అన్నారు. రామమందిరం ఆధారంగా బిజెపి చేపట్టిన ప్రచారాన్ని అయోధ్యలో ఇండియా ఫోరం ఓడించిందని తెలిపారు. అహ్మదాబాద్‌లో శనివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో రాహుల్ ప్రసంగించారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం పేరుతో పేద భూములను లాక్కున్నారని, రామాలయ ప్రారంభోత్సవానికి అయోధ్య నుంచి ఒక్కరిని కూడా ఆహ్వానించకపోవడంతో వారు మనస్తాపానికి గురయ్యారని చెప్పారు. రాముడి పేరిట దేశమంతటా రాజకీయం చేసిన బిజెపికి కానీ, ఆ పార్టీ నేతలకు కానీ రామాలయం ప్రారంభోత్సవ సమయంలో అంబానీ, అదానీ వంటి బడా కార్పోరేట్లు తప్ప ఒక్క పేదవాడూ కనిపించలేదని రాహుల్ విమర్శించారు. అయోధ్యలో పోటీ చేయాలని తొలుత ప్రధాని మోడీ నిర్ణయించుకున్నారని, అయితే అక్కడ ఆయన ఓడిపోతారని సర్వేల్లో వెల్లడికావడంతో తిరిగి వారణాసికి వెళ్లిపోయారని తెలిపారు.

यूनियन बैंक ऑफ इंडिया | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

తిరువూరు శాఖ
7-81, డి.యల్.యన్ టవర్స్, జయాభవి సెంటర్ రోడ్డు, తిరువూరు, కృష్ణాజిల్లా-521235, ఫోన్: 9959797308.

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 54 / 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తిరువూరు శాఖ.** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు **తేది. 10-11-2022** న డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన బకాయి **రూ. 8,22,021 (అక్షరాల ఎనిమిది లక్షల ఇరవై రెండు వేల ఇరవై ఒకటి రూపాయలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ చెల్లించవలసినదిగా ఋణగ్రహీత మరియు హామీదారులను కోరియున్నారు. **శ్రీ పలగాని వెంకటేశ్వరరావు,** తండ్రి: సత్యనారాయణ, హెచ్.నెం.3-4, బందులదొడ్డి బజారు, విసన్నపేట, యన్.టి.ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-521215. సదరు మొత్తాన్ని చెల్లించుటలో ఋణగ్రహీతల మరియు తనఖాదారు విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని దిగువ సంతకందారు **తేది. 06-07-2024** న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన యెడల అవి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,** వారికి బకాయి **రూ. 8,22,021/-(అక్షరాల ఎనిమిది లక్షల ఇరవై రెండు వేల ఇరవై ఒకటి రూపాయలు మాత్రమే)** మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలకు బద్ధులై ఉంటారని ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

విసన్నపేట మండలం, విసన్నపేట, ఆర్.యస్.నెం. 390/5, డి.నెం. 3-3 లో 1014.40 చ॥గ॥ల ఇంటి స్థలం మరియు అందు గల పూరిల్లు ఈ దిగువ హద్దులలో **తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** పలగాని వెంకటేశ్వరరావు మరియు జగపతి గారి స్థలం, **పడమర:** కారంగుళ అచ్చయ్య గారి స్థలం, **ఉత్తరం:** పలగాని నాగేశ్వరరావు గారి స్థలం.

తేది : 06-07-2024
ప్రదేశం : నూజివీడు

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda | **బ్యాంక్ ఆఫ్ బరోడా**
నూజివీడు బ్రాంచ్, #17-248, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్ రోడ్డు, నూజివీడు, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521201.

డిమాండ్ నోటీసు
(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క చాప్టర్-III యొక్క సెక్షన్ 13(2) ప్రకారం)

ఋణగ్రహీత'లు: **శ్రీ గంగుల నాగమారేశ్వరరావు,** తండ్రి : వెంకటేశ్వరరావు, డి.నెం. 3-143-1, చిత్తాపూర్, చాట్రాయి మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521213. **శ్రీమతి గంగుల లీలావతి (శ్రీమతి కంచర్ల లీలావతి అని కూడా పిలుస్తారు),** భర్త : గంగుల నాగమారేశ్వరరావు, డి.నెం. 3-143-1, చిత్తాపూర్, చాట్రాయి మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521213. **శ్రీమతి కంచర్ల లీలావతి (శ్రీమతి గంగుల లీలావతి అని కూడా పిలుస్తారు),** తండ్రి : రామదాసు, 50-14-1/1ఎ, గుణదల, గంగిరెడ్డి దిబ్బ, మాచవరం, విజయవాడ అర్బన్, ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 520004. **(హోమ్ లోన్ అకౌంట్ నెం.:45160600004247)**

విషయము: బ్యాంక్ ఆఫ్ బరోడా, నూజివీడు బ్రాంచ్ మీకు మంజూరు చేసిన ఆర్థిక సహాయం- హోమ్ లోన్ యొక్క అసలు మరియు వడ్డీ, మొదలగునవి చెల్లించడంలో మీరు విఫలం అయినారు.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క చాప్టర్-III యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా **తేది.29-06-2024**న మీకు తిరుగురసీదులతో కూడిన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. కానీ సదరు నోటీసు మీరు సదరు చిరునామాలో లేనందున / తీసుకోనందున మరియు తపాల శాఖ వారిచే బ్రాంచినకు తిరుగు రసీదులు వచ్చినందున ఈ పత్రికాప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది: మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించనందున సదరు అకౌంట్ **తేది.01-05-2023** నుండి నిరర్థక ఆస్తిగా (ఎన్‌పిఎ) పరిగణింపబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు బకాయి మొత్తం **రూ.6,08,954.54 పై** (అక్షరాల ఆరు లక్షల ఎనిమిది వేల తొమ్మిది వందల యాభై నాలుగు రూపాయల యాభై నాలుగు పైసలు మాత్రమే) + **తేది.31.12.2022** నుండి ఇంకా విధించని వడ్డీ మరియు ఛార్జీలు, ఇతర ఖర్చులు, మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (13) నియమానుసారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారి ముందస్తు లిఖిత అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకం, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేయబడినది.

స్థిరాస్తి వివరములు:

ఏలూరు జిల్లా, చాట్రాయి మండలం, చిత్తాపూరు గ్రామం, ఆర్.ఎస్.నెం. 100/4 లోని సమీప డోర్ నెం. 2-51 (డోర్ నెం. 3-143) వద్ద 484 చ॥గ॥ల విస్తీర్ణంలో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్డ్ భవనం మరియు నివాస స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు : (CERSAI ID: 400013951988): తూర్పు :** గంగుల యర్ర గోపయ్య మరియు అలివేలమ్మ గార్ల భూమి, **పడమర :** పంచాయితీ రోడ్డు, **ఉత్తరం :** చిమటా రామలక్ష్మి గారి భూమి, **దక్షిణం :** తులిమెల్లి కృష్ణ గారి భూమి.

తేది : 06-07-2024
ప్రదేశం : నూజివీడు

సం/- అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor, Door No. 31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam- 530020.
O.A. No. 500 OF 2021

Between :
ICICI BANK LTD.,
Represented by its Manager
Door No. 40-1-127, 128 and 129
RIBG, 3rd Floor, Murali Chambers,
M.G. Road, Vijayawada- 520010
...Applicant

AND :
Sri Jakka Ashok
D.No. 4-136, Srinivasa Puram
Pondugula Guntur, Andhra Pradesh, Guntur- 522414 and another ...Defendants

SUMMONS TO 1st DEFENDANT TO BY PAPER PUBLICATION

D-1) Sri Jakka Ashok
D. No. 4-136, Srinivasa Puram
Pondugula Guntur Andhra Pradesh, Guntur- 522414

WHEREAS O.A. No. 500 of 2021 was listed before the Honourable Presiding Officer/Registrar on 24/07/2024.

WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under U/S 19(4) of the Act, (OA) filed against you for the recovery of Rs. 34,08,260/- (Rupees Thirty Four Lakhs Eight Thousand Two Hundred and Sixty Only) (Application along with copies of documents etc. Annexed)

In accordance with sub section (4) of section 19 of the Act, you the defendants are directed as under :-

(i) To show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted;

(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.

(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;

(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without prior approval of the tribunal;

(v) You shall not be liable to account for the sale proceeds realized by sale of secured assets or other properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institution holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appeal before Presiding Officer/Registrar on 24/07/2024 at 10:30 A.M. failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this date: 30/04/2024

Signature of the Officer
Authorized to issue summons.

ఎలాంటి చర్చ లేకుండా భారత న్యాయ సంహిత రుద్దారు : అమర్త్య సేన్



కొల్‌కతా: ఎలాంటి చర్చ లేకుండా ఐపిసి స్థానంలో భారతీయ న్యాయ సంహితను దేశ ప్రజలపై రుద్దారు. ఇది స్వాగతించదగిన మార్పు ఎంతమాత్రమూ కాదని నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ ఆర్థిక వేత్త అమర్త్య సేన్ పేర్కొన్నారు. ఆయన శనివారం నాడు శాంతినికేతన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఇటువంటి కొత్త చట్టాలను తీసుకురావడానికి ముందు వీటిపై సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నిటితో విస్తృతంగా చర్చించాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. ఈ మూడు నేర చట్టాల విషయంలో అటువంటి చర్చలేవీల జరిగిన దాఖలాలు లేవని ఆయన చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై వ్యాఖ్యానించమని విలేకరులు కోరినప్పుడు హిందూత్వ రాజకీయాలకు కొంతమేరకు అడ్డుకట్ట పడినట్లు ఈ ఫలితాలు వెల్లడిస్తున్నాయని అన్నారు. దేశంలో నిరుద్యోగానికి ప్రధాన కారణం విద్య, ఆరోగ్య రంగాలను నిర్లక్ష్యం చేయడమేనని సేన్ అన్నారు. కొత్త విద్యా విధానంలో పెద్దగా కొత్తదనమేమీ లేదని అన్నారు.

ఎట్టకేలకు పెదవి విప్పిన భోలేబాబా

హత్రాస్ : ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన తొక్కిసలాట ఉదంతంపై నారాయణ్ సకార్ హరి అలియాస్ భోలే బాబా విచారం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన తర్వాత ఆయన తొలిసారి పెదవి విప్పారు. 'ఈ నెల 2న జరిగిన ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ బాధను భరించే శక్తిని మాకు ఆ భగవంతుడు ఇవ్వాలని కోరుకుంటున్నాను. దయచేసి ప్రభుత్వంపై, అధికారులపై నమ్మకం ఉంచండి. గందరగోళాన్ని సృష్టించిన వారెవ్వరినీ వదలబోరన్న నమ్మకం ఉంది' అని ఆయన తెలిపారు. బాధిత కుటుంబాలకు సాయం అందించాల్సిందిగా తన న్యాయవాది సత్సంగ్ కమిటీ సభ్యులను కోరారని చెప్పారు.

90 స్టేట్‌మెంట్లు నమోదు

హత్రాస్ తొక్కిసలాట ఘటనపై విచారణ జరుపుతున్న సిట్ ఇప్పటి వరకూ 90 మంది ఇచ్చిన స్టేట్‌మెంట్లను నమోదు చేసింది. ఇప్పటికే ప్రాథమిక నివేదిక అందజేశామని, తుది నివేదికను రూపొందిస్తున్నామని సిట్ అధినేత, ఆగ్రా డివిజన్ ఏడీజీ అనుపమ్ కులశ్రేష్ట తెలిపారు. ఆయన హత్రాస్‌లో పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ విచారణ పరిధిని విస్తరించామని, మరిన్ని ఆధారాలు లభ్యమవుతున్నాయని చెప్పారు. సత్సంగ్ నిర్వాహకుల తప్పిదాల కారణంగానే తొక్కిసలాట జరిగిందనడానికి ఆధారాలు ఉన్నాయని అన్నారు.

అమర్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

బాల్తాల్ : వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు అధికారులు శనివారం ప్రకటించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నారు. రెండు మార్గాల్లోనూ యాత్రను నిలిపివేసినట్టు స్పష్టం చేశారు. బాల్తాల్, పహల్గాం మార్గాల్లో గత రాత్రి నుంచి వర్షాలు కురుస్తుండడంతో యాత్రికుల భద్రత నిమిత్తం ఈ చర్య తీసుకున్నట్లు వివరించారు. అమర్‌నాథ్ ఆలయ గుహ, శేషనాగ్ శిఖరం వద్ద ఉష్ణోగ్రత గరిష్ఠంగా 15 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటుందని, రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ప్రత్యామ్నాయం కోసం అమెరికన్ల ఎదురుచూపు

- రెండు పార్టీల వ్యవస్థ పట్ల పెరుగుతున్న విముఖత !



పాలస్తీనాకు సంఘీభావంగా ప్రదర్శన చేపట్టిన సోషలిజం అండ్ లిబరేషన్ పార్టీ నేత క్లాడియా డీ లా క్రజ్

వాషింగ్టన్ : అమెరికాలోని రెండు ప్రధాన పార్టీల అధ్యక్ష అభ్యర్థులు గత నెల 27న జరిగిన చర్చా వేదికలో పాల్గొన్న తీరుతో అసంతృప్తిగా వున్న మెజారిటీ ప్రజలకు దేశంలోని ఈ రెండు పార్టీల వ్యవస్థ పట్ల విముఖత పెరుగుతోంది. దీనికి ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అధ్యక్షుడు బైడెన్ మానసిక ఆరోగ్యంపై అనేక వదంతులు, వార్తలు ప్రచారంలో వున్నాయి. తాజాగా చర్చలో పాల్గొన్న తీరు, ఆ తర్వాత బైడెన్ చెప్పిన కారణాలతో డెమోక్రటిక్ నేతలు, దాతల్లోనే భయాందోళనలు నెలకొన్నాయి. బైడెన్ శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రజలకు నమ్మకం లేకుండా పోయిందని, దేశాన్ని ఆయన పాలించే పరిస్థితిలో లేరని ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడవుతోంది. మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఈ చర్చల్లో బలంగా వ్యవహరించారని అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో బైడెన్‌ను తప్పించాల్సిందేనని డెమోక్రటిక్ ఓటర్లు బలంగా కోరుకుంటున్నారు. ఈ వారం ప్రారంభంలో రాయిటర్స్-ఇప్సాస్ నిర్వహించిన పోల్ ప్రకారం, ప్రతి ముగ్గురు డెమోక్రటిక్ ఓటర్లలో ఒకరు బైడెన్‌ను అధ్యక్ష ఎన్నికల పోటీ నుండి తప్పించాలని భావిస్తున్నారు. బైడెన్ నామినీగా లేకపోతే ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ గెలిచే అవకాశాలు వున్నాయని 75శాతంమంది ఓటర్లు అభిప్రాయపడుతున్నారని జులై 2న సిఎన్ఎన్ నిర్వహించిన పోల్‌లో వెల్లడైంది. బైడెన్ కన్నా ట్రంప్ బెటర్ అని చాలామంది స్పష్టం చేస్తున్నారు.

అధ్యక్ష అభ్యర్థుల చర్చతో పాటు గాజా దాడుల విషయంలో బైడెన్ ప్రజాదరణను కోల్పోయారు. ఈసారి వేరే అభ్యర్థిని నిలబెట్టాలని 67శాతం మంది డెమోక్రటిక్ పార్టీ ఓటర్లు కోరుకుంటున్నారని గతేడాది సెప్టెంబరులో సిఎన్ఎన్ పోల్‌లో వెల్లడైంది.

డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీలు దేశ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా బాగా పాతుకుపోయాయి. చట్టపరమైన అణచివేతలు, మీడియా బ్లాకవుట్‌ల కారణంగా మూడో పార్టీ లేదా ఆ పార్టీ అభ్యర్థులు రాజకీయాల్లో బహిష్కరించబడ్డారు. అయితే ఇటువంటి పరిస్థితుల్లో తృతీయ రాజకీయ ప్రత్యామ్నాయం అనేది చక్కగా పనిచేస్తుందని నాలుగు శాతం మంది యువత పేర్కొంటున్నారని ప్యూ రీసెర్చ్ సెంటర్ పేర్కొంది.

రెండు పార్టీల వ్యవస్థకు ప్రజల దూరంగా జరుగుతున్నారని క్లాడియా డీ లా క్రజ్ వ్యాఖ్యానించారు. బైడెన్, ట్రంప్‌లకు వ్యతిరేకంగా సోషలిజం అండ్ లిబరేషన్ పార్టీ టిక్కెట్‌పై క్లాడియా పోటీ చేస్తున్నారు.

SBI | **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
ఎస్ఎంఇసిసిసి సైబెరాబాద్ (64263), 12-6-39/ఎ, కెకెఆర్ బిల్డింగ్ వై జంక్షన్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500072.

డిమాండ్ నోటీసు

(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ (3)తో చదువబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద).

ఇందుమూలంగా దిగువ రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు& హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, బ్యాంకు నుండి వారిచే పొందిన రుణాల సదుపాయాలకు అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్టిచెందారు మరియు రుణాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్స్ (ఎన్‌పిఎ)గా వర్గీకరించబడినవి. వారికి వారి గతంలో తెలిసిన చిరునామాల పై సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసులు జారీచేయబడినవి, కాని అవి వారికి బట్వాడా కాకుండానే వెనుదిరిగినవి మరియు ఇట్టి పరిస్థితుల్లో ఈ బహిరంగ ప్రకటన రూపేనా వారికి తెలియజేయబడుచున్నది.

క్ర.సం.	రుణగ్రహీత పేరు/ నోటీసు తేదీ/ ఎన్‌పిఎ తేది	అస్తుల వివరాలు/ స్వాధీనంచేసుకొను సెక్యూర్డ్ అసెట్ చిరునామా	బకాయి మొత్తాలు
1	1. **సాయి సిద్ధార్థ హోమియో డిస్ట్రిబ్యూటర్స్, ఫ్యాక్టరీ చిరునామా:** ప్లాట్ నం.56-59, ఫ్లాట్ నం.101/ఎ, 1వ అంతస్తు, ఎండిఆర్ ఆర్కెడ్, అశిష్ గార్డెన్ ఎదురుగా, న్యూ బోయెన్‌పల్లి, సికింద్రాబాద్-500011. **1) శ్రీ కిష్టం రాము (ఫర్మ్ యజమాని)** ప్లాట్ నం.15, అమర్ జ్యోతి కాలనీ, న్యూ బోయెన్‌పల్లి, సికింద్రాబాద్-500009. **2) శ్రీ జనగర్ల గోవింద రావు తండ్రి జె. రామయ్య (హామీదారు),** ఇ.నం. 4-66/8, మల్లెముడి వారి వీధి, విజయవాడ (రూరల్) రామవరప్పాడు, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. పిన్: 521108, మొబైల్: 9885924952. **ఎన్‌పిఎ తేది: 24.04.2024** **డిమాండ్ నోటీసు తేది: 18.06.2024** **బ్రాంచి: బిహెచ్ఇఎల్ ఆర్ & డి కాంప్లెక్స్ బ్రాంచి (06300)** **A/c No.s: 31460433949, 39365935237**	రామవరప్పాడు గ్రామం, విజయవాడ మండలం, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర. 521108, ఆం.ప్ర. రాష్ట్రం వద్ద ఎస్ఆర్ఓ విజయవాడ వద్ద 15 డిసెంబర్ 1984న నిర్వహించిన రిజిస్టర్డు సేల్ డీడ్ పత్రం నం.8062/1984 ఆధారంగా, **శ్రీ జనగర్ల గోవింద రావు తండ్రి జె. రామయ్య** పేరున ప్లాన్ 857 చ.అ.ల ప్రకారం 2 పోర్షన్ల కలిగిన 1042చ.అ.ల పూర్తి ప్లింత్ ఏరియాతో గ్రౌండ్ ఫ్లోర్‌లో భవనముతోపాటు 178చ.గ.ల విస్తీర్ణపు ల్యాండ్ యొక్క వాల్యుయేషన్ కంప్రైసెస్ క్రింద బాదె వారి వీధి, సర్వే నం.128/13బి, నివాస ఇంటి నం.5-70 (పాత నం.4-66) గల ఆస్తి మొత్తం. మరియు సరిహద్దులు: **ఇంటి సరిహద్దులు: ఉత్తరం:** కొండపాటూరు వీర రాఘవయ్య కు చెందని ఆస్తి, **దక్షిణం:** కొండిశెట్టి నాంచారయ్య ఆస్తి, **తూర్పు:** 7.5అ.ల వెడల్పు రోడ్డు ఉమ్మడి బాజారు, **పడమర:** మల్లెముడి సీతయ్య ఆస్తి	**18.06.2024 నాటికి రూ. 21,86,279/- (రూపాయలు ఇరువై ఒక లక్షల ఎనభై ఆరు వేల రెండు వందల డెబ్బై తొమ్మిది మాత్రమే) + రూ. 16,726/- (రూపాయలు పదహారు వేల ఏడు వందల ఇరువై ఆరు మాత్రమే)**

నోటీసు అందజేయటానికి తదుపరి చర్యలు తీసుకోబడుచున్నవి. పై రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (ఎవరైతే వర్తించునో)ను ఇందుమూలంగా కోరునది ఏమనగా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజుల్లోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడుచున్న, విఫలం చెందినట్లైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత ఏదైతే తగిన చర్యలు తీసుకోబడుతాయి.

తేది: 06.07.2024,
ప్రదేశం: హైదరాబాద్

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గాజాలో కొనసాగుతున్న ఇజ్రాయిల్ మారణకాండ

- ఒకే రోజు ఐదుగురు జర్నలిస్టుల మృతి
- మరో 30 మంది పౌరులు కూడా..

గాజా : ఇజ్రాయిల్ మారణకాండ కొనసాగుతోంది. గాజాలో అమానవీయంగా సాగిస్తున్న దాడులను యథేచ్ఛగా కొనసాగిస్తోంది. మహిళలు, చిన్నారులతో పాటు అనేక మంది పాత్రికేయులు కూడా ఇజ్రాయిల్ దాష్టీకాలకు బలైపోతున్నారు. శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో గాజాలో ఇజ్రాయిల్ దాడుల్లో ఐదుగురు జర్నలిస్టులు చనిపోయారు. వీరితో పాటు మరో 30 మంది సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారు. జర్నలిస్టుల మృతదేహాలను గుర్తించి, వారి స్వస్థలాలకు చేరవేసేందుకు చర్యలు చేపట్టినట్లు పాలస్తీనా ఆరోగ్య శాఖ వెల్లడించింది. గాజా నగరంలోని జీటూన్ ప్రాంతంలో జరిపిన దాడిలో ఇద్దరు పాలస్తీనియన్లు మరణించగా, అంతకుముందు నుస్రత్ శరణార్థ శిబిరంపై జరిగిన దాడిలో పదిమంది పాలస్తీనియన్లు చనిపోయారు. పశ్చిమ రఫా నగరంలో పాలస్తీనా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ దాడి చేయడంతో ఆరుగురు పోలీసులు చనిపోయారు. ప్రజలను ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ ఆర్మీ ఆదేశాలు జారీ చేయడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు వెళ్ళిపోతుండడంతో వారి ఇళ్ళను ఈ బలగాలు కాపలా కాస్తున్నాయి, ఈసారి వారిపై ఇజ్రాయిల్ దాడులు చేసింది.

మరోవైపు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో 15మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలగాలు అరెస్టు చేశాయి. గాజాలో కాల్పుల విరమణపై వచ్చే వారం చర్చలు జరగనున్నాయి. కాగా తూర్పు గాజాలో జూన్ 27 నుండి ఇప్పటివరకు దాదాపు 80వేల మంది నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల విభాగం తెలిపింది. దాడుల కారణంగా నీరు, ఆహారం కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్న గాజాలో పిల్లలకు రోజులో 8గంటల పాటు నీరు, ఆహారం సంపాదించడానికే సరిపోతోందని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ పేర్కొంది. తక్షణమే ఈ పరిస్థితులు మారాలని, కాల్పుల విరమణ జరగాలని ఎక్స్‌లో పోస్టు పెట్టింది. గత 9మాసాలుగా ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో 38098 మంది మరణించగా, 87,705 మంది గాయపడ్డారు.

పని దినాలు పెంచిన గ్రీస్

- క్రూరమైన చర్యగా పేర్కొన్న కార్మిక సంఘాలు

ఏథెన్స్ : పని దినాలను వారానికి ఆరు రోజులకు పెంచుతూ గ్రీస్ ప్రభుత్వం చట్టం చేసింది. కార్మిక సంఘాల నుంచి వ్యతిరేకత ఉన్నప్పటికీ కొత్త చట్టం జూలై 1 నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో 24 గంటలు సేవలు అందించే ప్రైవేట్ కంపెనీల ఉద్యోగులు ఇకపై వారానికి 40 గంటలకు బదులుగా 48 గంటలు పని చేయాల్సి ఉంటుంది. కార్మికులు రోజుకు అదనంగా 2 గంటలు లేదా ప్రతి వారం అదనంగా 8 గంటల షిఫ్టు పనిచేసే అవకాశం ఉంది. టూరిజం, హోటల్ రంగాల్లో పనిచేసే కార్మికులకు ఈ చట్టం వర్తించదు. ఈ కొత్త చట్టం క్రూరమైన చర్యగా కార్మిక సంఘాలు, రాజకీయ పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. యాజమాన్యాలు అదనపు సిబ్బందిని నియమించుకోకుండా ఉండేందుకు ఈ చర్య తీసుకున్నట్లు యూనియన్లు తెలిపాయి. ఆర్థిక వద్ధిలో గతంలో ఐరోపా దేశాల కంటే ముందు వరుసలో ఉన్న గ్రీస్ ఆ తర్వాత అత్యంత తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం కార్మిక చట్టాన్ని సవరిస్తోంది. అనేక దేశాలు పనిదినాలను వారానికి నాలుగుకు తగ్గిస్తున్న తరుణంలో గ్రీస్ నిర్ణయం చర్చనీయాంశమైంది. గ్రీస్ ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్ మాట్లాడుతూ.. ఈ చట్టం కార్మికులకు అనుకూలమైనది, ఇతర యూరోపియన్ దేశాలను అందుకోవడానికి అవసరమైనదని చెప్పుకొచ్చారు.

HEMADRI CEMENTS LIMITED
Regd.Office & Factory: Vedari Village-521 457, Jaggaiahpet Mandal, Krishna District.,A.P.(India)
NOTICE OF THE 42ND ANNUAL GENERAL MEETING

Dear Member(s),

1. Notice is hereby given that the 42nd Annual General Meeting (AGM) Of the Company Will be convened on Wednesday, the 31st day of July 2024 at 3.00 P.M, through Video Conferencing (VC) or Other Audio Visual Means (OAVM) facility in compliance with the applicable provisions of the Companies Act, 2013 and Rules framed thereunder and SEBI (LODR) Regulations, 2015 read with Circulars of Ministry of Corporate Affairs and Securities and Exchange Board of India, issued pursuant to conducting of Annual General Meeting.
2. The Notice of the 42nd AGM and the Annual Report for the year 2023-24 including the Financial Statements for the year ended 31st March 2024 will be sent only by email to all those Members, whose email addresses are registered with the Company or with their respective Depository Participants ("Depository").
3. The instructions for e-voting for participating in the AGM are provided in the Notice of the AGM. The Notice of the AGM and the Annual Report will also be available on the website of the Company i.e. https://hemadricements.com/annual_reports and in the website of Stock Exchanges i.e. BSE Limited: https://www.bseindia.com and CDSL's e-voting portal at https://www.evotingindia.com.
4.Members holding shares in physical mode and have not registered their E-Mail ID may update the same by communicating to the Company at the address / E-Mail ID given below. Members holding shares in demat mode may contact their respective depository participant for the same.
5.The Cut-Off Date is 24th July 2024 and the Register of Members and Share Transfer Books of the Company will remain closed from Thursday, the 25th July 2024 (9.00 A.M) to Wednesday the 31st July 2024 (3.00 P.M) (both days inclusive) for the purpose of determining the eligibility of the shareholders to vote by remote e-voting in the AGM.
6. Members holding shares in physical mode and members who have not registered their E-Mail ID with the Company! Depository Participant and the members who have acquired shares after the dispatch of the notice and holding shares as of Cut-Off Date, may cast their vote through remote e-voting or through the e-voting during the meeting.


Members may also note that:

a) Voting Rights shall be in proportion to the Equity Shares held by the Members as on the Cut-Off Date.
b) Remote e-voting will commence at 10 AM on Sunday, the 28th July 2024 and ends at 5 PM on Tuesday the 30th July 2024 (both days inclusive). During this period, Members holding shares as on the Cut-off date may cast their votes electronically.
c) Those Members, who will be present in the AGM through VC and have not cast their vote on the resolutions through remote e-voting and are otherwise not barred from doing so, shall be eligible to vote through remote e-voting system during the AGM.
d) Members who have cast their votes by remote e-voting prior to the AGM may also attend and participate in the AGM through VC but shall not be entitled to cast their votes again.
e) If you have any queries or issues regarding attending AGM & e-Voting from the CDSL e-Voting System, you can write an email to helpdesk.evoting@cdslindia.com or contact at Toll Free No.1800-22-55-33.

Date : 06-07-2024
Admin. Office: No 3, Veerasamy Street, III Floor, West Mambalam, Chennai - 600033.

For Hemadri Cements Limited,
Krish Narayananan,
Company Secretary.





మీకోసం

పగిలిన గుడ్డును కొద్దిగా వెనిగర్ కలిపిన నీటితో ఉడికిస్తే లోపలి ద్రవం బయటికి రాకుండా ఉంటుంది.

జీవన సౌరభం

ఉన్నతంగా ఆలోచించడం అలవాటు చేసుకున్నప్పుడు మనకు మనమే మార్గదర్శకులుగా మారుతాం.

మార్పు



రంగారావు, జానకమ్మ దంపతుల పిల్లలు చైతన్య, భారతి చాలా అల్లరి పిల్లలు. ఇద్దరూ ఎప్పుడూ ఏదో ఒక విషయమై గొడవ పడుతుండేవారు. అమ్మానాన్నలు తెచ్చిన తినుబండారాలు, వస్తువులు నాకంటే నాకే కావాలని మారాం చేసేవారు. ప్రతిరోజూ అల్లరి చేయడం, గొడవకు దిగడం ఇద్దరికీ ఒక అలవాటుగా మారిపోయింది. దీంతో దంపతులిద్దరికి విసుగు వచ్చేది.

ఒకరోజు రంగారావు జాతర నుంచి ఏనుగు బొమ్మ తీసుకొచ్చాడు. ఏనుగు బొమ్మ తనకే కావాలని ఇద్దరూ మంకు పట్టు పట్టారు. దానిని చెరొక వైపు పట్టుకొని లాగడంతో బొమ్మ కిందపడి పగిలిపోయింది. దీంతో ఇద్దరూ ఏడుపు ప్రారంభించారు. రంగారావు, జానకమ్మలకు ఏం చేయాలో పాలుపోలేదు.

పిల్లల్లో మార్పు తేవాలని రంగారావు చాలా ఆలోచించాడు. ఒకరోజు ఇంటి ముందు చెట్టుపై ఒక పిట్ట గూడు కట్టుకోవడం చూశాడు. అందులో రెండు చిన్న పిట్ట పిల్లలు ఉన్నాయి. పిట్ట పిల్లలను రంగారావు కొద్దిసేపు జాగ్రత్తగా చూసాడు. ఆయనకు ఒక ఉపాయం తట్టింది. ఆలస్యం చేయకుండా పిల్లలిద్దరినీ పిలిచాడు. ఆ చెట్టు పైన గల పిట్ట గూడును, అందులో ఉన్న రెండు పిట్ట పిల్లలను చూపించాడు.

'పిల్లలూ! మీరు పది రోజులపాటు బడి నుంచి వచ్చిన తర్వాత ఆ పిట్ట పిల్లలను, అవి చేస్తున్న పనులను పరిశీలించాలి. మీరు గమనించిన అంశాలను పుస్తకంలో రాయాలి' అన్నాడు. ఎప్పుడూ చదువుకొమ్మని చెప్పే నాన్న, పక్షులను పరిశీలించమనడంతో చైతన్య, భారతి చాలా ఉత్సాహపడ్డారు.

మరుసటి రోజు నుంచి పిట్ట పిల్లలను జాగ్రత్తగా గమనించటం మొదలు పెట్టారు. గమనించిన అంశాలను నోటు పుస్తకాల్లో రాశారు. ఆ తరువాత రోజు నుంచి పిల్లలిద్దరూ ఒకరితో ఒకరు జగడం చేసుకోకుండా, కలిసిమెలిసి ఉంటూ, అమ్మ చెప్పిన పనిని శ్రద్ధగా చేస్తుండడం రంగారావు గమనించాడు. ఇలా పది రోజులు గడిచాక, ఓ రోజు వారు నాన్న దగ్గరికి వచ్చి, తాము పరిశీలించిన అంశాలను వివరించారు. పిట్ట పిల్లలు రెండూ ఎప్పుడూ కలిసిమెలిసి ఉంటున్నాయని, ఏ రోజూ గొడవ పడలేదని, అమ్మ తెచ్చిన గింజలను కలిసి మెలిసి తింటున్నాయని చెప్పారు. వాటిని చూసి, తాము కూడా తమ ప్రవర్తనను మార్చుకున్నామని వివరించారు. పిట్ట పిల్లలు తమ పిల్లల్లో తెచ్చిన మార్పుకు రంగారావు దంపతులు తెగ సంతోషపడ్డారు.

- పోరెడ్డి అశోక్,
83749 16403.

పేర్లు రాయండి

పిల్లలూ కింద ఇచ్చిన క్లూ ఆధారంగా పక్షులు, జంతువుల పేర్లు రాయండి.

కా-	న-
కో- -	సిం-
గా- -	పు-
జిం-	నె- -
తో- -	వా- -

నేను గీసిన బొమ్మ





ఆర్.ఆదర్శ్ గౌడ్,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాంపూర్ మండలం,
నిజాంపేట,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నిర్మాతగా మార్చిన సినిమా ఇష్టం

చిన్నప్పటినుంచి సినిమా అంటే ఆమెకు అమితమైన ఇష్టం. ఎప్పటికైనా ఒక సినిమా తీయాలని కలలు కంది. ఇంట్లోనూ, బయటా ఆమె ఆ మాట అంటుంటే- విన్న వాళ్లు అదేదో హాస్యం అనుకునేవాళ్లు. కానీ, ఆమె అలా అనుకోలేదు. రూపాయి రూపాయి కూడేసి, ఇప్పుడు సినిమా తీసింది.



రెడీ... లైట్స్... కెమెరా.. యాక్షన్.. అంటూ సాగే సినిమా లోకం ఒక ప్రత్యేకం. అలాంటి రంగంలో చదువూ సంధ్యా లేని ఓ మహిళ అద్భుతాన్ని సృష్టించారు. కూలీ పనులు చేస్తూ.. చిన్నపాటి హోటల్ నడుపుతూ ఏకంగా రూ.80 లక్షలు పెట్టి సినిమానే తీశారు. ఆమె పేరు చెన్నెబోయిన వెంకట నర్సమ్మ, ప్రకాశం కొనకనమిట్ల మండలం పెదరికట్ల గ్రామం. సినిమా అంటే ఆమె చిన్నప్పటినుంచి విపరీతమైన ఇష్టం. ఆ ఇష్టమే కొడుకు చేత ఓ సినిమాను తీయించేలా చేసింది.

చెన్నెబోయిన వెంకటేశ్వరరావు, వెంకట నర్సమ్మ దంపతులది ఓ చిన్న రైతు కుటుంబం. ఉండేది చుట్టుంటి పాకలో.. నేటికీ వంట కట్టెపొయ్యిల మీదే! వారి కుమారుడు వెంకట రవీంద్రనాథ్. దంపతులు ఇద్దరూ తమ పొలంలో పనులు చేసుకుంటూ ఖాళీ సమయాల్లో వ్యవసాయ పనులకు సైతం వెళ్తుంటారు. కుమారుడు రవి చిన్నా చితకా ఉద్యోగాలు చేస్తున్నాడు. బాల్యం నుంచే సినిమాలపై ఓ ప్రత్యేకమైన ఇష్టమున్న వెంకట నర్సమ్మ ఎప్పటికైనా ఓ సినిమా తీయాలనుకున్నారు. తరచూ ఆ మాట అంటూ ఉంటే భర్త, కుమారుడు నవ్వి ఊరుకునేవారు. సరదాగా భావించేవారు. సినిమా మాటలు కాదు, ధనం మూటలు కావాలీ అనేవారు. ఆ విషయం తనకూ తెలుసని, డబ్బు సమకూరుస్తానని అనేది వెంకట నర్సమ్మ. పదేళ్ల క్రితం కొడుకు రవి వద్ద సినిమా తీయాలనే కోరికను గట్టిగా చెప్పింది. రూ.500 చేతిలో పెట్టి హైదరాబాద్ పంపింది. రవి అక్కడ చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటూ, ఖాళీ సమయాల్లో స్టూడియోలకు వెళ్లి పలువురు దర్శకులు, నిర్మాతలను కలిశాడు. ఎప్పటికప్పుడు తల్లికి ఆ విషయాలన్నీ వివరిస్తూ ఉండేవాడు. తరువాత సినిమా పరిశ్రమలో వివిధ రంగాల్లో పనిచేసి, కొంత ప్రావీణ్యం సంపాదించాడు. తన తల్లి కోరినట్టుగానే సినిమా తీస్తే బాగుంటుందనే నిర్ణయానికి వచ్చాడు.

సినిమా కోసం 20 ఏళ్లుగా హుండీ

వెంకట నర్సమ్మ కుటుంబం వ్యవసాయ పనులు చేసుకుంటూనే 70 జీవాలు (గొర్రెలు, మేకలు), 30 వరకూ గేదెలు పెంచుతూ, వాటి ద్వారా ఆదాయం పొందేది. వారికి మూడెకరాల పొలం కూడా ఉండేది. వచ్చే సంపాదనలో కొంత భాగాన్ని వెంకట నర్సమ్మ హుండీలో జమ



చేస్తుండేవారు. ఒకసారి ఆ సొమ్ము బయటికి తీసి లెక్కిస్తే- రూ.3 లక్షలు అయింది! ఆ మొత్తాన్ని కుమారుడికి పంపించి, సినిమాకు తొలి పెట్టుబడి సిద్ధం అన్నారు వెంకట నర్సమ్మ. డబ్బు సమకూర్చాలి అన్న తపనతో చెరకురసం బండి నడిపారు ఆమె. ఆ తర్వాత టిఫిన్ బండి పెట్టారు. కొండగట్టు వద్ద రాగి సంగటి హోటల్ ఏర్పాటు చేశారు. ఇలా వచ్చిన సంపాదనలో కొంత భాగాన్ని పోగేశారు. హోటల్ ద్వారా, పొలం ద్వారా, జీవాల ద్వారా వచ్చిన ఆదాయం మొత్తం రూ.50 లక్షలు కూడేసి, ఒక సినిమా తీయాలని కుమారుడిని ప్రోత్సహించారు. రవి ఈలోగా ఒక సినిమా స్క్రిప్టు తయారు చేశాడు. నటీనటులను ఎంచుకున్నాడు. రెండేళ్ల క్రితం షూటింగ్ ప్రారంభించాడు. సమకూర్చిన డబ్బులు సరిపోలేదు. దీంతో, ఉన్న మూడెకరాల పొలాన్ని అమ్మేశారు. ఆ మొత్తం కూడా చాలకపోవటంతో ఆమె తన పుస్తెలమ్మి సినిమాను తీశారు. మొత్తానికి ఆ సినిమాకు నిర్మాతగా ఆమె పేరు పోస్టరు మీదికి ఎక్కింది.

ఏమిటీ సినిమా?


తెలంగాణాలో దేవదాసీ వ్యవస్థలాగానే కోస్తాంధ్రలో ఒకప్పుడు మాతంగులు ఉండేవారు. ఇప్పుడూ ఉత్సవాలు, జాతర్లు, ఎల్లమ్మ తిరునాళ్ల వంటి సమయాల్లో వారిని డ్యాన్స్ చేయటానికి తీసుకొస్తుంటారు. పెత్తందారులు వారిని తమ కోర్కెలు తీర్చే సాధనంగా చూస్తారు. వారు చెప్పినట్లుగా వినకపోతే కొట్టడం, హింసించటం చేస్తుంటారు. పరిసర ప్రాంతాల్లో జరిగే ఉత్సవాల్లో ఇలాంటి సంఘటనలను వెంకటనర్సమ్మ, వెంకటేశ్వరరావు దంపతులు స్వయంగా చూశారు. వారితో ప్రత్యక్షంగా అనేకసార్లు మాట్లాడారు. అప్పుడు వెంకట నర్సమ్మ మనసులో నాటుకున్న భావమే 'స్పిరిట్' సినిమాగా రూపుదిద్దుకుంది. 8త్ వండర్ సినిమా బ్యానర్‌పై నిర్మితమైన ఈ 'స్పిరిట్ (ఈజ్ నాట్ వన్)' సినిమా త్వరలో విడుదల కానుంది. రవిబాబు, సత్యప్రకాష్, చిత్రం శ్రీను, రమ్య, ప్రియ, పింకీ, జూనియర్ రాజశేఖర్, ప్రేమకథా చిత్రం సైదులు, జబర్దస్త్ నాగ్‌తేజ్, చిట్టిబాబు తదితరులు ఇందులో నటించారు. నిర్మాత చెన్నెబోయిన వెంకట నర్సమ్మ కాగా, దర్శకత్వం ఆమె కుమారుడు వెంకట రవీంద్రనాథ్

సినిమా తీయాలని చిన్నప్పటి నుంచే ...

వెంకట నర్సమ్మ తన బాల్యంలో ఎన్నో సినిమాలు చూశారు. సినిమాలు చూస్తూ పెరిగారు. తన చుట్టుపక్కల వారితో చూసిన సినిమా గురించి చెబుతూ ఉండేవారు. చిన్నప్పుడు 'బ్రహ్మంగారి చరిత్ర', 'పొట్టేలు పున్నమ్మ' సినిమాలు తనను బాగా కదిలించాయి అని ఆమె చెబుతారు. పెళ్లి అయిన తర్వాత భార్యాభర్తలు ఇద్దరూ కలిసి 'పుట్టింటికి రా చెల్లి' సినిమా చూశారు. అది కూడా తనకు బాగా జ్ఞాపకం అని చెబుతారామె. మహిళా పాత్రలు బలంగా, ప్రభావశీలంగా ఉంటే ఇష్టం ఆమెకు. చదువు లేకపోయినా, సినిమా పరిజ్ఞానం ఎప్పటికప్పుడు పెంచుకున్నారు. ఎప్పటికన్నా సినిమా తీయాలి అనుకొని, డబ్బు సమకూర్చి, కొడుకు రవి ద్వారా సినిమా కోరికను నెరవేర్చుకున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

ఆ దురాచారం పోవాలని ...



మాతంగుల జీవితాలు చాలా దుర్భరం. వారి చేత అశ్లీల ప్రదర్శనలు ఇవ్వటమే కాదు; వారిని లైంగికంగా వేధించటం, వారిపై దౌర్జన్యాలు చేయడం మంచిదికాదు. మాతంగులపై జరిగే దురాచారాలు పోవాలి. వారు కూడా మంచిగా జీవించాలనే ఇతివృత్తంతో ఈ సినిమా తీశాం. వారి పిల్లలు ఇలాంటి వృత్తిలోకి రాకుండా ఉండాలనేది మా సంకల్పం. మా సినిమాను అందరూ ఆదరించాలని కోరుకుంటున్నా.

-చెన్నుబోయిన వెంకటనర్సమ్మ, నిర్మాత

మూక దాడులపై ముస్లిం సంస్థల ఆందోళన

- తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న జమాతే ఇస్లామి హిండ్ నాయకులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4 నుండి దేశంలో పలుచోట్ల విద్వేష దాడులు, హింసాత్మక సంఘటనలు పెరిగిపోయాయని ప్రముఖ ముస్లిం సంస్థలైన జమాతే ఇస్లామి హింద్, జమైత్ ఉలేమా ఇ హింద్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న ఈ వేధింపులు, మూక దాడుల ఘటనలపై నిరసన గళాలు వినబడుతున్నాయి. గో వధకు పాల్పడ్డారంటూ నిరాధారమైన ఆరోపణలతో వేధింపులకు గురిచేసి చంపడం, ఇళ్ళను కూల్చివేయడం వంటి కిరాతకాలకు పాల్పడుతుండడంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక చట్టాలు రూపొందించాలని, కేంద్ర హోంమంత్రి ఒక ప్రకటన చేయాలని ఈ రెండు సంస్థలతో పాటూ సామాజిక కార్యకర్తలు, మత పరమైన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

దేశంలో నెలకొన్న విద్వేష పరిస్థితులపై జమాత్ ఇ ఇస్లామి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఒక ప్రకటన వెలువరించింది. ప్రజలందరి భద్రత, రక్షణ తమ ప్రభుత్వ బాధ్యత అని చెబుతూ అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం ఆ కీలక బాధ్యతను విస్మరించినట్ల కనిపిస్తోందని జమాత్ ఉపాధ్యక్షుడు సలీం ఇంజనీర్ వ్యాఖ్యానించారు. ఎన్నికల అనంతరం ముస్లింలను లక్ష్యంగా చేసుకుని దేశంలో చోటు చేసుకున్న పలు దాడులను, సంఘటనలను పేర్కొంటూ ఎపిసిఆర్ (అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) రూపొందించిన నివేదికను ఆయన మీడియాకు అందచేశారు. జూన్ 7, జులై 5 మధ్య వేధింపులకు గురిచేసి చంపేసిన సంఘటనలు పది వరకు నమోదయ్యాయని ఆ నివేదిక పేర్కొంది. ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్‌ల్లో పై సంఘటనలు చోటు చేసుకోగా, తెలంగాణా, ఒరిస్సా, రాజస్థాన్‌ల్లో మత హింసతో పాటూ ఇటువంటి వేధింపులు జరిగాయి. ఈ సంఘటనలపై ఎఫ్ఐఆర్‌లు నమోదైనా చాలా కేసుల్లో ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. ముస్లింలను ఇలా లక్ష్యంగా చేసుకోవడాన్ని తక్షణమే ఆపాలని జమాత్ ఇ ఇస్లామి హింద్ డిమాండ్ చేసింది. ఇటువంటి హేయమైన దాడులపై ప్రభుత్వం కఠిన వైఖరి తీసుకోవాలని, ప్రతి ఒక్క పౌరుని భద్రతకు హామీ కల్పించాలని డిమాండ్ చేసింది.

జమైత్ ఉలేమా ఇ హింద్ అధ్యక్షుడు అర్షద్ మదాని కూడా ఇదే రీతిలో మాట్లాడారు. మూక దాడులనేవి హింస యొక్క క్రూరమైన రూపమని వ్యాఖ్యానించారు. దీన్ని నివారించడానికి చట్టం తీసుకురావాలని దీర్ఘకాలం నుండి తాము డిమాండ్‌చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు కూడా దీనిపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిందన్నారు. ఈ తరహా హింసను ఆపేందుకు చర్యలు తీసుకోవాలని కఠినమైన ఆదేశాలు కూడా జారీ చేసిందన్నారు. అయితే ఇంతవరకు ఎలాంటి తీవ్రమైన ప్రయత్నం జరగలేదన్నారు.



పశ్చిమబెంగాల్‌లో ఉప ఎన్నిక జరగనున్న మణి కట్ల నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం అభ్యర్థి రాజీవ్ మజుందార్

7 రాష్ట్రాలు.. 13 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు

- జులై 10న పోలింగ్
- ఎన్డీయే, ఇండియా బ్లాక్‌ల మధ్య పోటీ

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జులై 10న ఉప ఎన్నికలు జరగనున్నాయి. పార్లమెంటు ఎన్నికల్లో గెలవడంతో పలువురు ఎమ్మెల్యేలు శాసనసభను విడిచిపెట్టారు. దీంతో ఆ అసెంబ్లీ స్థానాలు ఖాళీ అయ్యాయి. అదే సమయంలో కొందరు ఎమ్మెల్యేల మరణంతో మరికొన్ని అసెంబ్లీ స్థానాలు ఖాళీ కావడంతో ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. జులై 10న బీహార్‌లో 1, బెంగాల్‌లో 4, తమిళనాడులో 1, మధ్యప్రదేశ్‌లో 1, ఉత్తరాఖండ్‌లో 2, పంజాబ్‌లో 1, హిమాచల్ ప్రదేశ్‌లో 3 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ జూన్ 14న విడుదలైంది. అన్ని ప్రక్రియల తర్వాత జులై 10న పోలింగ్ నిర్వహించనుండగా 13న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

ఎన్‌డిఎ సర్కార్ ప్రగతి అంతా నేరాల్లోనే

- ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ చురక



బీహార్: బీహార్‌లో జెడియు నేతృత్వ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం సాధించిన ప్రగతి అంతా నేరాల్లోనే అని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) నేత, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ శనివారం చురకలంటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత మూడు, నాలుగు రోజుల్లోనే అత్యాచారాలు, హత్యలు, దోపిడీలతో సహా 41 నేరాలు చోటుచేసుకున్నాయని తన ట్విట్టర్ పోస్ట్‌లో వెల్లడించారు. మంగళవారం పాట్నాలోని ఓ ఇంటి వెలుపల నాలుగేళ్ల బాలికను గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపిన తరువాత తేజస్వీ యాదవ్ పై విధంగా స్పందించారు. గత 3-4 రోజుల్లో జరిగిన నేరాలు, అవి ఎక్కడెక్కడ జరిగాయో వివరాలతో సహా ట్విట్టర్ లో వెల్లడించారు.

జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ : ఒక జవాన్ మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో తీవ్రవాదులకు, జవాన్లకు మధ్య శనివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక సైనికుడు అమరుడయ్యారు. సైనిక ఉన్నతాధికారులు తెలిపిన వివరాల ప్రకారం..దక్షిణ కాశ్మీర్ కుల్గాం జిల్లాలోని మోడర్గమ్ గ్రామంలో తీవ్రవాదులు దాగి ఉన్నారంటూ భద్రతా దళాలకు నిఘా విభాగం నుంచి సమాచారం అందడంతో ఆ గ్రామంలో భద్రతా దళాలు ముమ్మర తనిఖీలు చేపట్టాయి. ఆ క్రమంలో ఉగ్రవాదులు జరిపిన ఎదురు కాల్పుల్లో ఓ సైనికుడు వీర మరణం పొందారు. అయితే ఈ ఎదురు కాల్పుల్లో సైనికుడికి తీవ్ర గాయాలయ్యాయని.. దీంతో అతడు మరణించారని ఉన్నతాధికారులు వెల్లడించారు. మరోవైపు భద్రతా దళాలతో కలిసి కాశ్మీర్ జోన్ పోలీసులు ఈ ఎదురు కాల్పులు జరుపుతున్నారు. దీంతో ఎన్‌కౌంటర్ కొనసాగుతుంది. ఈ మేరకు కాశ్మీర్ జోన్ పోలీసులు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. గత కొద్ది నెలలుగా జమ్మూ కశ్మీర్‌లో వరుసగా తీవ్రవాదుల దాడులు జరుగుతున్నాయి.

తొలి పరీక్షలో యువ జట్టుకు నిరాశ

- 116పరుగుల ఛేదనలో 102పరుగులకే పరిమితం
- తొలి టి20లో జింబాబ్వే చేతిలో అనూహ్య ఓటమి
- బిష్ణోయ్ మాయాజాలం వృథా



శుభ్‌మన్ (31 పరుగులు

హరారే: యువ క్రికెటర్లతో జింబాబ్వే పర్యటనకు వెళ్లిన టీమిండియాకు షాక్ తగిలింది. జింబాబ్వేతో హరారేలోని స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన తొలి టి20లో భారతజట్టు 13 పరుగుల తేడాతో అనూహ్యంగా ఓటమిపాలైంది. తొలుత భారత బౌలర్లు రాణించడంతో జింబాబ్వే జట్టును కేవలం 115పరుగులకే పరిమితం చేసిన భారత్.. ఆ స్వల్ప లక్ష్యాన్ని ఛేధించే క్రమంలో 102పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(31), సుందర్(27), ఆవేశ్ ఖాన్(16) మాత్రమే రెండంకెల స్కోర్ నమోదు చేయగా.. అరంగేట్రం ఆటగాళ్లు అభిషేక్ శర్మ(0), రియాన్ పరాగ్(2) ఘోరంగా విఫలమయ్యారు. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో జింబాబ్వే జట్టు 1-0 ఆధిక్యతలో నిలిచింది. జింబాబ్వే బౌలర్లలో తెందాయ్ చటారా, కెప్టెన్ సికిందర్ రాజాకు మూడేసి, బ్రయాన్ బెన్నెట్, వెల్లింగ్టన్ మసకడ్జా, బ్లెస్సింగ్ ముజరబాని, ల్యూక్ జోంగ్వేలకు ఒక్కో వికెట్ దక్కాయి.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ కాకా(0)ను ముఖేష్‌కుమార్ త్వరగా పెవీలియన్‌కు పంపాడు. ఆ తర్వాత బెన్నెట్, మధర్వ్ కలిసి 2వ వికట్‌కు 34పరుగులు జతచేశారు. జింబాబ్వే ఓ దశలో 74పరుగులకు 3వికెట్లు కోల్పోయి భారీస్కోర్ దిశగా పయనించేలా కనిపించింది. ఆ దశలో స్పిన్నర్ రవి బిష్ణోయ్ అద్భుతం చేశారు. 4ఓవర్లలో 2ఓవర్లు మెయిడెన్లు వేసి 13పరుగులే ఇచ్చి నాలుగు వికెట్లు తీసి జింబాబ్వేను కట్టడి చేశాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు ఒక్కొక్కరు ఔటవుతున్నా.. వికెట్ కీపర్ మధండే(29నాటౌట్) క్రీజ్‌లో నిలిచి ఆదుకున్నాడు. దీంతో జింబాబ్వే గౌరవప్రద స్కోర్ చేయగల్గింది. టీమిండియా బౌలర్లు బిష్ణోయ్‌కు నాలుగు, సుందర్‌కు రెండు, ముఖేష్ కుమార్, ఆవేశ్ ఖాన్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి.

ఛేదనలో టీమిండియా ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ 31 పరుగులు చేశాడు. ఆఖర్లో అవేష్ ఖాన్ 16 పరుగులు నమోదు చేశాడు. కెరీర్ లో తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న ఓపెనర్ అభిషేక్ శర్మ (0 డకౌట్ అయ్యాడు. రుతురాజ్ గైక్వాడ్ 7, రియాన్ పరాగ్ 2, ధ్రువ్ జురెల్ 7 పరుగులు చేశారు. రింకూ సింగ్ (0) పరుగులేమీ చేయకుండానే వెనుదిరిగాడు.

స్కోర్‌బోర్డు...

జింబాబ్వే ఇన్నింగ్స్: మధెర్వ్ (బి)రవి బిష్ణోయ్ 21, కాలా (బి)ముఖేశ్ కుమార్ 0, బెన్నెట్ (బి)రవి బిష్ణోయ్ 23, సికిందర్ రాజా (సి)బిష్ణోయ్ (బి)ఆవేశ్ ఖాన్ 17, మయర్స్ (సి అండ్ బి)సుందర్ 23, క్యాంప్‌బెల్ (రనౌట్) సుందర్/ఆవేశ్ ఖాన్ 0, మధండే (నాటౌట్) 29, మసకడ్జా (స్టంప్)జురెల్ (బి)సుందర్ 0, జోంగ్వే (ఎల్‌బి)బిష్ణోయ్ 1, ముజరబాని (బి)బిష్ణోయ్ 0, ఛటారా (నాటౌట్) 0, అదనం 2. (20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 115పరుగులు. **వికెట్ల పతనం:** 1/6, 2/40, 3/51, 4/74, 5/74, 6/89, 7/89, 8/90, 9/90 **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3-0-28-0, ముఖేశ్ 3-0-17-1, బిష్ణోయ్ 4-2-13-4, అభిషేక్ 2-0-17-0, ఆవేశ్ ఖాన్ 4-0-29-1, సుందర్ 4-0-11-2.

ఇండియా ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి)మసకడ్జా (బి)బెన్నెట్ 0, శుభ్‌మన్ (బి)రాజా 31, గైక్వాడ్ (సి)కాలా (బి)మసకడ్జా 7, రియాన్ పరాగ్ (సి)మవుటా బి)ఛటారా 2, రింకు సింగ్ (సి)బ్రియాన్ బెన్నెట్ (బి)ఛటారా 0, ధృవ్ జురెల్ (సి)మధెర్వ్ (బి)జోంగ్వే 6, సుందర్ (సి)ముజరబాని (బి)ఛటారా 27, రవి బిష్ణోయ్ (ఎల్‌బి) రాజా 9, ఆవేశ్ ఖాన్ (సి)రాజా (బి)మసకడ్జా 16, ముఖేశ్ కుమార్ (బి)రాజా 0, ఖలీల్ అహ్మద్ (నాటౌట్) 0, అదనం 4. (19.5ఓవర్లలో ఆలౌట్) 102పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/15, 3/22, 4/22, 5/43, 6/47, 7/61, 8/84, 9/86, 10/102 **బౌలింగ్:** బెన్నెట్ 1-1-0-1, మసకడ్జా 3-0-15-1, ఛటారా 3.5-1-16-3, ముజరబాని 4-0-17-1, జోంగ్వే 4-0-28-1, సికిందర్ రాజా 4-0-25-3

సెమీస్‌కు ఫ్రాన్స్

షూటౌట్‌లో పోర్చుగల్‌పై 5-3గోల్స్‌తో గెలుపు



బెర్లిన్(జర్మనీ): యూరో-2024 సెమీఫైనల్లోకి ఫిఫా ప్రపంచకప్ రన్నరప్ ఫ్రాన్స్ జట్టు దూసుకెళ్లింది. శుక్రవారం రాత్రి జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్లో ఫ్రాన్స్ జట్టు 5-3గోల్స్ తేడాతో పెనాల్టీ షూటౌట్‌లో పోర్చుగల్‌ను ఓడించింది. నిర్ణీత, రెండు అదనపు సమయాలు ముగిసేసరికి ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో 0-0తో మ్యాచ్ ముగిసింది. షూటౌట్‌లో ఫ్రాన్స్ ఆటగాళ్లందరూ గోల్స్ చేయగా.. పోర్చుగల్ ఆటగాడు ఒక గోల్ చేయడంలో విఫలమయ్యాడు. దీంతో ఫ్రాన్స్ జట్టు సెమీస్‌కు చేరింది. తొలి క్వార్టర్స్‌లో స్పెయిన్ జట్టు 2-1గోల్స్ తేడాతో ఆతిథ్య జర్మనీని చిత్తుచేసి సెమీస్‌కు చేరింది. బుధవారం జరిగే తొలి సెమీస్‌లో ఫ్రాన్స్ జట్టు స్పెయిన్‌తో తలపడనుంది.

ప్రి క్వార్టర్స్‌కు క్రేజికోవా, ఒస్టాపెంకో

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి 31వ సీడ్ క్రేజికోవా, 13సీడ్ ఒస్టాపెంకో ప్రవేశించారు. శనివారం జరిగిన మూడోరౌండ్ పోటీలో క్రేజికోవా(చెక్ రిపబ్లిక్) 6-0, 4-3 ఆధిక్యతలో ఉండగా బోంజాస్(స్పెయిన్) గాయంతో మ్యాచ్‌నుంచి వైదొలిగింది. ఇక ఒస్టాపెంకో (లాత్వియా) 6-1, 6-3తో పెరా(అమెరికా)లను వరుససెట్లలో చిత్తుచేశారు. మరో పోటీలో కలిన్కయా 7-6(7-4), 6-2తో 15వ సీడ్ సంసునోవా(రష్యా)ను ఓడించి ప్రి క్వార్టర్స్‌కు చేరారు.

పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ జెన్నిక్ సిన్నర్(ఇటలీ), 4వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ)తోపాటు 14వ సీడ్ షెల్టన్(అమెరికా) ప్రి క్వార్టర్స్‌కు చేరారు. శనివారం జరిగిన మూడోరౌండ్ పోటీలో సిన్నర్ 6-1, 6-4, 6-2తో కెక్మనోవిక్(సెర్బియా)పై వరుససెట్లలో ఓడించాడు. మరో పోటీలో జ్వెరేవ్ 6-4, 6-4, 7-6(17-15)తో అన్‌సీడెడ్ నొర్రి(డెన్మార్క్)ను ఓడించాడు. చివరి సెట్‌లో జ్వెరేవ్ గెలుపులో తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. ఇక ఐదుసెట్ల హోరాహోరీ పోరులో షెల్టన్ విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన ఆ మ్యాచ్‌లో షెల్టన్ 6-7(4-7), 6-2, 6-4, 4-6, 6-2తో షపొవాలోవ్(కెనడా)ను ఓడించాడు. మరో పోటీలో బటిస్టా(స్పెయిన్) 7-6(8-6), 3-6, 5-7, 7-6(7-1), 6-4తో ఫోగ్నిని(ఇటలీ)ని చిత్తుచేసి ప్రి క్వార్టర్స్‌కు చేరాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68